తన వృత్తిని పవిత్రంగా,
గౌరవంగా భావించే వ్యక్తి
ఒక్క క్షణం కూడా సోమరిగా
ఉండలేడు.
- మహాత్మాగాంధీ

Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 216 | గురువారం 29 జనవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎం
# అజిత్ పవార్ కన్నుమూత



- బారామతిలో కూలిన ప్రయివేట్ జెట్...
- మరో నలుగురు మృతి
- విజిబిలిటీ లేకపోవడమే కారణమా?
- ప్రధాని సహా పలువురు ప్రముఖుల సంతాపం
- నేడు అంత్యక్రియలు
- విచారణ జరుపుతున్న ఏఏఐబీ, డీజీసీఏ

2లో

పూనే - సూర్య వాస్తవం

మహారాష్ట్రలో బుధవారం ఉదయం జరిగిన విమాన ప్రమాదంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ (66) దుర్మరణం పాలయ్యారు. ఆయనతో పాటు విమానంలో ప్రయాణించిన మరో నలుగురు వ్యక్తులు కూడా చనిపోయారు. వీరు ప్రయాణిస్తున్న వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థ (ఢిల్లీ)కు చెందిన లియర్‌జెట్-46 విమానం పూనే జిల్లాలోని బారామతి సమీపంలో కుప్పకూలి పోయింది. విమాన రాడార్ అందించిన డేటా ప్రకారం...ఉదయం 8.10 గంటలకు ఈ విమానం ముంబయిలో బయలుదేరింది. ఆ తర్వాత 8.45 గంటలకు రాడార్ నుంచి అదృశ్యమైంది. దట్టంగా మంచు కమ్ముకోవడంతో రన్‌వే సమీపంలో వెలుతురు తక్కువగా ఉన్నదని పైలట్ తొలుత సమాచారం ఇచ్చాడు.

- మిగతా 2లో..

# అమిత్ షా-పవన్ భేటీ..

- ఉప్పాడ రక్షణ గోడ ప్రాజెక్టుపై ముందడుగు!
- సీ వాల్ ప్రతిపాదనలకు కేంద్రం నుంచి సానుకూల స్పందన
- రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులపై చర్చలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలతో పాటు, ప్రత్యేకించి ఉప్పాడ తీర ప్రాంత కోత నివారణపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. ఢిల్లీలోని అమిత్ షా నివాసంలో సాయంత్రం 5 గంటల సమయంలో ఈ సమావేశం జరిగింది. ఉప్పాడ ప్రాంతంలో సముద్రపు కోతను అరికట్టేందుకు శాశ్వత పరిష్కారంగా 'సీ ప్రొటెక్షన్ వాల్' (సముద్ర రక్షణ గోడ) నిర్మాణ ప్రతిపాదనపై పవన్ చర్చించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పురోగతిని ఆయన అమిత్ షాకు వివరించారు. కాకినాడ జిల్లా యంత్రాంగం ఇప్పటికే ఈ ప్రతిపాదనను జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (చీణహీూ) టెక్నికల్ అడ్వైజరీ కమిటీకి సమర్పించింది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడం పట్ల పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. సుమారు రూ. 320-323 కోట్ల అంచనా వ్యయంతో ఈ రక్షణ గోడను నిర్మించనున్నారు. పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గ పరిధిలోనే ఉప్పాడ ఉంది.

- మిగతా 2లో..

# అవినీతికి కళ్లెం

- పవర్ టెక్నాలజీ హబ్‌గా ఇండియా
- గ్రామీణ ఉపాధి కల్పన కోసమే వీబీజీఆర్ ఏఎంజీ చట్టం
- దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం
- ఇండియా డిఫెన్స్ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది
- పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- వీబీజీఆర్‌ఏఎంజీ చట్టంపై ప్రతిపక్షం ఆందోళన
- కొత్తదేమీ లేదు : సీపీఐ(ఎం) రాజ్యసభాపక్ష నేత జాన్ బ్రిట్టాస్



న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

దేశంలో అవినీతి కట్టడికి ప్రభుత్వం పని చేస్తోందని, దీంతో ప్రజాధనాన్ని సద్వినియోగం చేసుకుంటుదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. గ్రామీణ ఉపాధి కల్పన కోసమే వీబీజీఆర్?ఏఎంజీ చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని పేర్కొన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభిస్తూ బుధవారం ఆమె పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ దేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తోందని చెప్పారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని దేశం సంస్కరణల పథంలో దూసుకెళ్తోందని అన్నారు. పీఎల్?ఐ పథకం కింద పారిశ్రామికోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతి సాధించామని చెప్పారు. సముద్ర వ్యాపారాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు వెల్లడించారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పదేండ్లలో పేదల కోసం నాలుగు కోట్ల ఇండ్లు కట్టించామని, జల్ జీవన్ మిషన్ కింద గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. 'పదేండ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. 10 కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు అందించాం. సామాజిక న్యాయం ప్రాతిపదికన కేంద్రం పనిచేస్తోంది. వందేభారత్, అమృత్ భారత్ రైళ్లతో

- మిగతా 2లో..

## శబరిమల బంగారం కేసులో
# వీడిన చిక్కుముడి!



- శబరిమల బంగారం కేసులో కీలక శాస్త్రీయ ఆధారాలు
- గర్భగుడి తలుపులను మార్చలేదని తేల్చిన వీఎస్ఎస్‌సీ
- రాగి రేకులపై ఉన్న బంగారు పొరను రసాయనాలతో దోపిడీ
- ఈ మేరకు హైకోర్టుకు నివేదిక సమర్పించిన దర్యాప్తు బృందం
- త్వరలో తుది నివేదిక ఇస్తామని చెప్పిన శాస్త్రవేత్తలు

2లో



## రాయలసీమ నుంచి కోస్తాకు
# మెరుగైన రైలు మార్గాలు

- రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- పోర్టుల నుంచి ఇతర రాష్ట్రాలకు రైలు కనెక్టివిటీపై ప్రధానంగా చర్చ
- హై స్పీడ్ రైల్ కారిడార్ల ఏర్పాటు ప్రతిపాదనపై సమావేశంలో సమీక్ష
- విజయవాడ, విశాఖ వంటి జంక్షన్లలో రద్దీ తగ్గించడంపై చర్చ

అమరావతి- సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, కొత్త మార్గాల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. సచివాలయంలో దక్షిణ మధ్య, తూర్పు కోస్తా, దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ల జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రైలు కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని హింటర్ ల్యాండ్‌కు సరుకు రవాణాను పెంచేందుకు అవసరమైన రైలు అనుసంధానంపై సమావేశంలో

- మిగతా 2లో..




## తెలంగాణ రైజింగ్‌కు
# సహకరించండి

- ప్రొఫెసర్ డస్టిన్ టింగ్లేతో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - సూర్య వాస్తవం

తెలంగాణ రైజింగ్ విజన్‌కు సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీలోని కెన్నెడీ స్కూల్ సహకారాన్ని కోరారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని కెన్నెడీ స్కూల్‌లో తరగతులకు ముఖ్యమంత్రి హాజరవుతున్న సంగతి తెలిసిందే. తరగతుల విరామ సమయంలో రేవంత్ రెడ్డి హార్వర్డ్ ఎక్స్ వైస్-ప్రోవోస్ట్, హెడ్ ప్రొఫెసర్ డస్టిన్ టింగ్లే, హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ డీన్ ప్రొఫెసర్ జెరెమీ వైన్‌స్టీన్‌లను కలిశారు. వారికి తెలంగాణ రైజింగ్ విజన్ పై ప్రజంటేషన్ ఇచ్చారు. దాన్ని

- మిగతా 7లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## రాయలసీమ నుంచి కోస్తాకు మెరుగైన రైలు మార్గాలు

(మొదటిపేజీ తరువాయి)
ప్రధానంగా చర్చించారు. అలాగే, రాయలసీమ ప్రాంతాల నుంచి కోస్తాంధ్రలోని వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీని మెరుగుపరిచే అంశాలపైనా సమీక్షించారు. విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్, గుంటూరు, రేణిగుంట వంటి ప్రధాన జంక్షన్లలో రైళ్ల రద్దీని తగ్గించే మార్గాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విజయవాడ బైపాస్, భద్రాచలం రోడ్-కొవ్వూరు వంటి కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనల పురోగతిని కూడా సీఎం సమీక్షించారు. గిరిజన ప్రాంతాలకు రైలు సౌకర్యాన్ని విస్తరించడంపై ప్రత్యేకంగా చర్చించారు. హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు మార్గాలను హై స్పీడ్ రైల్వే కారిడార్లుగా అభివృద్ధి చేసే ప్రణాళికలపైనా ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రైల్వే నెట్‌వర్క్ విస్తరణ కీలకమని ఈ సందర్భంగా చంద్రబాబు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

## అమిత్ షా-పవన్ భేటీ..

(మొదటిపేజీ తరువాయి)
అక్కడి ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సముద్రపు కోత సమస్యకు కేంద్రం సహకారంతో శాశ్వత పరిష్కారం కనుగొంటానని ఆయన గతంలో హామీ ఇచ్చారు. ఆ దిశగా ఈ భేటీ ముందడుగుగా కనిపిస్తోంది. సమావేశం ఫలప్రదంగా జరిగిందని పవన్ తన సోషల్ మీడియా ఖాతాలో పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్ పలువురు కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. ఇందులో భాగంగానే అమిత్ షాతో భేటీ అయ్యారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్?తో కూడా సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులపై చర్చించినట్లు జనసేన వర్గాలు తెలిపాయి.

## తెలంగాణ రైజింగ్‌కు సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)
సాధించేందుకు కెన్నెడీ స్కూల్ సహకరించాలని కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించినట్టు సీఎంఓ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ సందర్భంగా ముఖ్యమంత్రి వారితో నాణ్యమైన విద్యాభివృద్ధి, ఆధునిక నైపుణ్యాల అభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధితో ఆర్థిక వృద్ధిపై పడే ప్రభావాలపై చర్చించారు.

## శబరిమల బంగారం కేసులో వీడిన చిక్కుముడి!

**- శబరిమల బంగారం కేసులో కీలక శాస్త్రీయ ఆధారాలు**
**- గర్భగుడి తలుపులను మార్చలేదని తేల్చిన వీఎస్ఎస్సీ**
**- రాగి రేకులపై ఉన్న బంగారు పొరను రసాయనాలతో దోపిడీ**
**- ఈ మేరకు హైకోర్టుకు నివేదిక సమర్పించిన దర్యాప్తు బృందం**
**- త్వరలో తుది నివేదిక ఇస్తామని చెప్పిన శాస్త్రవేత్తలు**

శబరిమల- సూర్య వాస్తవం
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శబరిమల గర్భగుడి స్వర్ణ బంధనం (బంగారు తాపడం) చోరీ కేసులో కీలక పురోగతి లభించింది. గర్భగుడి తలుపులను మార్చలేదని, వాటిపై ఉన్న రాగి రేకుల మీద నుంచి బంగారు పొరను మాత్రమే నేర్పుగా దోచుకున్నారని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. ఈ మేరకు విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (ఇస్రో) శాస్త్రవేత్తలు సమర్పించిన నివేదికను, ప్రత్యేక దర్యాప్తు బృందం బుధవారం కేరళ హైకోర్టుకు సమర్పించింది. ప్రస్తుతం గర్భగుడికి ఉన్నవి అసలైన రాగి రేకులేనని, వాటిని మార్చలేదని వీఎస్?ఎస్?సీ శాస్త్రవేత్తలు తమ నివేదికలో స్పష్టం చేశారు. తలుపుల చెక్క ఫ్రేమ్‌వర్క్ (స్థానికంగా 'కట్టిల్' అంటారు) కూడా పాతదేనని నిర్ధారించారు. దొంగిలించబడింది ఘనమైన బంగారం కాదని, రాగి రేకులపై ఉన్న బంగారు పొర మాత్రమేనని తేల్చారు. కొన్ని రేకులపై బంగారం శాతం గణనీయంగా తగ్గడాన్ని బట్టి, రసాయనాలను ఉపయోగించి బంగారాన్ని వేరు చేసి ఉంటారని అంచనా వేశారు. రేకులపై కనిపించిన మార్పుల వల్ల వాటిని పూర్తిగా మార్చేసి ఉంటారని ఇప్పటివరకు ప్రచారం జరిగింది. అయితే, బంగారం వెలికితీతకు ఉపయోగించే పాదరసం వంటి రసాయనాల ప్రయోగం వల్లే వాటి ఉపరితలంలో మార్పులు వచ్చాయని, భౌతికంగా వాటిని మార్చలేదని శాస్త్రవేత్తలు వివరించారు. ఈ వాదనతో అంతర్జాతీయ ముఠాలకు విక్రయించి ఉంటారన్న ఊహాగానాలకు తెరపడినట్టయింది. ఈ కేసుకు సంబంధించి మరిన్ని విశ్లేషణలు కొనసాగుతున్నాయని, పాత గర్భగుడి తలుపుల నమూనాలతో పోల్చి తుది నివేదికను త్వరలోనే సమర్పిస్తామని వీఎస్?ఎస్?సీ అధికారులు సిట్?కు తెలిపారు. ఈ శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తునకు స్పష్టమైన దిశానిర్దేశం లభించింది. గర్భగుడి నిర్మాణాలను మార్చకుండా, కేవలం రసాయన ప్రక్రియ ద్వారా బంగారాన్ని ఎలా దొంగిలించారు, ఈ నేరం వెనుక ఉన్నదెవరు అనే కోణంలో ఇప్పుడు విచారణ జరగనుంది.

## ప్రతి విద్యార్థి మంచి మార్కులతో పాస్ కావాలి

**- అనంతపురం డీఈఓ కడప ప్రసాద్ బాబు**

**అనంతపురం- సూర్య వాస్తవం:**

పదో తరగతి చదివే ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి మంచి మార్కులతో పాసవ్వాలని డీఈఓ కడవ ప్రసాద్ బాబు కోరారు. అనంతపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో వంద రోజుల ప్రణాళిక అమలు తీరును బుధవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. సబ్జెక్టుల వారీగా పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. చదువులో వెనుకబడిన విద్యార్థు లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వారు కూడా మంచి మార్కులతో పాసయ్యేలా తర్ఫీదు నివ్వాలని ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులతోనూ మాట్లాడారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు ఎలా నిర్వహిస్తున్నారు. పిల్లలు అందరూ హాజరవుతున్నారా లేదా అని ఆరా తీశారు.

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)
బారామతి విమానాశ్రయంలో విమానాన్ని దింపేందుకు పైలట్ ప్రయత్నించగా అది కూలిపోయి మంటల్లో చిక్కుకుంది. నాలుగైదు పేలుడు శబ్దాలు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాగా ప్రమాద వార్త తెలియగానే ఎన్సీపీ (శరద్ పవార్) ఎంపీ సుప్రియా సూలే, అజిత్ సతీమణి సునేత్ర, కుమారుడు పార్థ్ భౌతికకాయాన్ని తరలించిన ఆస్పత్రికి వెళ్లారు.

**ప్రత్యక్షసాక్షి కథనం**
'చాలా బాధాకరం. విమానం కిందికి దిగుతున్న సమయంలోనే కూలిపోతుందని అనుకున్నాను. అలాగే జరిగింది. ఆ తర్వాత పేలిపోయింది. పెద్ద ఎత్తున పేలుడు జరిగింది. ఆ తర్వాత మేమంతా అక్కడికి చేరుకున్నాం. విమానం కాలిపోతూ కన్పించింది. మరోసారి విమానం నుంచి నాలుగైదు పేలుడు శబ్దాలు వినిపించాయి. విమానంలో ఉన్న వారిని బయటికి లాగేందుకు ప్రయత్నించాం. అయితే పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో ఏమీ చేయలేకపోయాం. విమానంలో అజిత్ పవార్ ఉండడం చాలా బాధ కలిగించింది. నేను దానిని మాటల్లో చెప్పలేను' అని ఓ ప్రత్యక్షసాక్షి చెప్పాడు. ప్రమాద తీవ్రతకు రెండు మృతదేహా లు ఎగిరి బయటపడ్డాయని తెలిపాడు. గాగుల్స్, చేతి గడియారాన్ని చూసి అజిత్ పవార్‌ను గుర్తించి బయటకు లాగామని, అయితే అప్పటికే నష్టం జరిగిపోయిందని వివరించాడు.

**నేడు అంత్యక్రియలు**
విమాన ప్రమాదంలో అజిత్ పవార్ చనిపోయిన విషయాన్ని పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) ధృవీకరించింది. విమానంలో ఇద్దరు వ్యక్తులు (ఒక పీఎస్ఓ, ఒక అటెండెంట్), ఇద్దరు విమాన సిబ్బంది (పైలట్, ఫస్ట్ ఆఫీసర్) ఉన్నారని తెలిపింది. విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) బృందం విచారణ జరుపుతోంది. కాగా విమాన ప్రమాదంలో మరణించిన అజిత్ పవార్ భౌతికకాయానికి గురువారం ఉదయం 11 గంటలకు బారామతిలోని విద్యా ప్రతిష్టాన్ మైదానంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతాయి. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరవుతారని తెలుస్తోంది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖ నేతలు కూడా వస్తారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ తెలిపింది. అజిత్ పవార్ మృతికి సంతాప సూచకంగా మహారాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ వరకూ మూడు రోజుల సంతాప దినాలు ప్రకటించింది. ఈ సమయంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ పతాకాన్ని అవనతం చేస్తారు. అధికారిక కార్యక్రమాలను నిర్వహించరు.

**కేంద్ర మంత్రి ఏమన్నారంటే....**
ప్రమాద సమయంలో బారామతి విమానాశ్రయంలో వెలుతురు తక్కువగా ఉన్నదని పైలట్ సమాచారం ఇచ్చారని, రన్?వే కనిపించడం లేదని చెప్పారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానం గాలిలో కొంతసేపు చక్కర్లు కొట్టిందని, ఆ తర్వాత రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించినప్పుడు రన్?వే కన్పిస్తుందా అని ఏటీసీ అడిగిందని, పైలట్ సానుకూలంగా స్పందించడంతో అనుమతి ఇచ్చిందని వివరించారు. అయితే ఆ వెంటనే విమానం కూలిపోయిందని అన్నారు. సమగ్ర దర్యాప్తు కోసం డీజీసీఏ, ఏఏఐబీ బృందాలు ఇప్పటికే పూనే చేరుకున్నాయని చెప్పారు. కాగా తాము ఆపదలో ఉన్నామని తెలియజేసే మేడే కాల్స్ ఏమీ పైలట్ల నుంచి రాలేదని డీసీసీఏ అధికారులు తెలిపారు.

**పలువురి సంతాపం**
అజిత్ పవార్ మృతిపై పలువురు నేతలు తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేసి సంతాపాన్ని ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధికి అజిత్ ఎంతో కృషి చేశారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. ఈ సమయంలో తన ఆలోచనలు ఆయన కుటుంబంతోనే ఉంటాయని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. అట్టడుగు స్థానం నుంచి ఉన్నత స్థానానికి ఎదిగిన ప్రజా నాయకుడిగా అజిత్ పవార్ ఎప్పటికీ ప్రజల గుండెల్లో ఉండిపోతారని అన్నారు. మృతుల కుటుంబాలకు ధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. కేంద్ర హోం మంత్రి అమిత్? షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలు పార్టీల నేతలు అజిత్ పవార్ మృతికి సంతాపం తెలియజేశారు. ప్రమాద ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్?, ఉప ముఖ్యమంత్రి షిండే, పలువురు రాష్ట్ర నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై విచారణ జరుపుతామని ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తెలిపారు.

**సాంకేతిక సమస్యలు లేవు : వీఎస్ఆర్ వెంచర్స్ వివరణ**
ప్రమాదానికి గురైన విమానంలో సాంకేతిక సమస్యలేవీ తలెత్తలేదని వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థ యజమాని వీకే సింగ్ తెలిపారు. విమానాల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పరీక్షిస్తామని ఆయన చెప్పారు. విమానాన్ని నడిపిన పైలట్లు అనుభవజ్ఞులని అంటూ ఇన్ కమాండ్?గా కెప్టెన్ సుమిత్ కపూర్‌కు 16 వేల గంటలు, కో పైలట్ కెప్టెన్ శాంభవి పాఠక్‌కు 1500 గంటల అనుభవం ఉన్నదని వివరించారు.

**'మీ విశ్వసనీయ ప్రభుత్వం' : అజిత్ చివరి మాటలు**
ప్రమాదానికి గురవడానికి ముందు చివరిసారిగా అజిత్ పవార్ సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలను ఆయన ఆ పోస్టులో వివరించారు. 'మీ విశ్వసనీయ ప్రభుత్వం' పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నదని తెలిపారు.

**కుట్ర లేదు : శరద్ పవార్**
అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం కేవలం ఒక ప్రమాదమేనని, అందులో ఎలాంటి కుట్ర లేదని, ఈ ఘటనను రాజకీయాల్లోకి లాగవద్దని ఎన్‌సిపినేత శరద్ పవార్ స్పష్టం చేశారు. ఆయన మృతి మహారాష్ట్రకు పెద్ద షాక్ అని వ్యాఖ్యానించారు.

**ఒక్కసారిగా ఎడమవైపునకు వంగి**
ప్రమాదానికి సంబంధించి కొత్తగా బయటకు వచ్చిన సిసిటివి ఫుటేజ్ ప్రకారం కూలిపోవడానికి కొద్ది క్షణాల ముందు విమానం పూర్తిగా ఎడమవైపునకు వంగిపోవడం కనిపిస్తోంది. చాలా వేగంతో కిందకు దిగుతున్న విమానం ఇలా ల్యాండింగ్ సమయంలో ఎడమవైపునకు వంగడం అసాధారణమని విమానరంగ నిపుణులు భావిస్తున్నారు. బహుశా సాంకేతిక వైఫల్యం వుండొచ్చునని అనుమానిస్తున్నారు.

**యువ పైలట్ శాంభవి పాఠక్ మరణం**

**కమర్షియల్ విమానాలు నడిపే లైసెన్స్ ఉన్నా..వెంటాడిన మృత్యువు**

మహారాష్ట్రలోని బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో యువ పైలట్ కెప్టెన్ శాంభవి పాఠక్ కూడా కన్నుమూశారు. చిన్న వయసులోనే కమర్షియల్ విమానాలు నడిపే లైసెన్స్ పొందిన ఆమె.. ప్రస్తుతం ప్రమాదం జరిగిన విమానంలో ఫస్ట్? ఆఫీసర్‌గా ఉన్నారు.శాంభవి పాఠక్ ఎయిర్‌ఫోర్స్ బాలభారతి స్కూల్‌లో చదువుకున్నారు. 2016-18 మధ్య సెకండరీ విద్యను పూర్తిచేసుకున్న ఆమె.. ముంబయి యూనివర్సిటీ నుంచి ఏరోనాటిక్స్, ఏవియేషన్, ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ పొందారు. న్యూజిలాండ్ ఇంటర్నేషనల్ కమర్షియల్ పైలట్‌అకాడమీలో కమర్షియల్ పైలట్ శిక్షణ తీసుకుని లైసెన్స్ పొందారు. ఆ తర్వాత భారత్‌కు వచ్చి డీజీసీఏ నుంచి కమర్షియల్ పైలట్ లైసెన్స్‌తో పాటు ఫ్రోజెన్ ఎయిర్‌లైన్ ట్రాన్స్‌పోర్ట్ పైలట్ లైసెన్స్ కూడా పొందారు. కొత్త పైలట్లకు శిక్షణ ఇచ్చేలా అసిస్టెంట్ ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్‌గానూ పనిచేశారు. 2022 ఆగస్టు నుంచి వీఎస్ఆర్ వెంచర్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలో ఫుల్ టైమ్ ఫస్ట్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీఐపీలు, బిజినెస్ ప్రముఖులు ప్రయాణించే లియర్‌జెట్-45 లాంటి విమానాలను నడుపుతున్నారు. బుధవారం అజిత్ పవార్ ప్రయాణించిన లియర్‌జెట్-45 విమానంలో పైలట్ ఇన్ కమాండ్‌గా కెప్టెన్ సుమిత్ కపూర్ వ్యవహరించగా.. శాంభవి ఫస్ట్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఈ ప్రమాదంలో సుమిత్ కూడా ప్రాణాలు కోల్పోయారు. కెప్టెన్ సుమిత్‌కు 16,500 గంటలు విమానం నడిపిన అనుభవం ఉంది.

## అవినీతికి కళ్లెం

(మొదటిపేజీ తరువాయి)
సేవలు విస్తరించాం. ప్రతి పౌరుడికి జీవిత బీమా కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. ఆయుష్మాన్ భారత్‌తో కోట్ల మందికి ఉచిత వైద్య సేవలందిస్తున్నాం. గతేడాది 2.5 కోట్ల మందికి ఉచిత వైద్యం అందించాం. వరి ఉత్పత్తిలో ప్రపంచంలోనే ఇండియా అగ్రస్థానంలో నిలిచింది. ఆక్వా, పాల ఉత్పత్తుల్లో ఇండియా ముందంజలో ఉంది' అని పేర్కొన్నారు. దేశంలో స్పేస్ టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలు న్నాయని అన్నారు. భవిష్యత్‌లో అంతరిక్షంలో స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని, జమ్మూ కాశ్మీర్‌లో అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మించామని తెలిపారు. 11 ఏండ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందిందని అన్నారు. జీఎస్టీ స్లాబ్‌ల తగ్గింపుతో దేశ ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకున్నాం. రూ.12 లక్షల వార్షిక ఆదాయం వరకు ఆదాయపు పన్ను లేకుండా చేశాం. స్మార్ట్?ఫోన్ల ఎగుమతుల్లోనూ దేశం దూసుకెళ్తోంది. దేశం పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతోంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో ఇండియాను పవర్ హౌస్‌గా తయారు చేస్తున్నాం. భవిష్యత్‌లో 100 గిగావాట్ల న్యూక్లియర్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి చర్యలు. వికసిత్ భారత్‌లో రైతుకు అధిక ప్రాధాన్యత ఉంటుంది' అని అన్నారు. 'గ్రామీణ ఉపాధి కల్పన కోసం వీబీజీఆర్ ఏఎంజీ చట్టం తీసుకొచ్చాం. దేశాభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర కల్పించాం. ఆపరేషన్ సిందూర్లో సైనికుల సత్తా చాటారు. ఇండియాపై దాడిచేస్తే ఏం జరుగుతుందో ప్రపంచం చూసింది. రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతి రికార్డు స్థాయిలో పెరిగింది. ఆపరేషన్ సిందూర్ తరువాత దేశ డిఫెన్స్ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. నానో చిప్?ల తయారీపైనా ఇండియా దృష్టి సారించింది. మైక్రో చిప్‌ల తయారీలో స్వయం సమృద్ధి సాధించాలి. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో 15 లక్షల ఉద్యోగాలు సృష్టించగలిగాం. ముద్ర యోజనతో చిరు వ్యాపారులకు భారీగా రుణాలు ఇచ్చాం. పీఎం విశ్వకర్మ యోజనతో 20 లక్షల మందికి శిక్షణ ఇస్తున్నాం' అని తెలిపారు.

**వీబీజీఆర్‌ఏఎంజీ చట్టంపై ప్రతిపక్షం ఆందోళన**
వీబీజీఆర్ ఏఎంజీ చట్టంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తున్నప్పుడు ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు చేబూని తమ స్థానాల్లో నిల్చొని చట్టానికి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. పాత ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, వీబీజీఆర్ ఏఎంజీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్లతో ప్రతిపక్ష సభ్యులు నినదించారు. దీంతో పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో గందరగోళం నెలకుంది. కాంగ్రెస్? నేత కేసీ వేణుగోపాల్? మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన దాన్ని రాష్ట్రపతి చదివారని, అందులో కొత్తదనమేది లేదని అన్నారు. ప్రభుత్వం చెప్పిందే పదేపదే రాష్ట్రపతితో చెప్పించిందని విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగం వాస్తవానికి దూరంగా ఉందని ఎద్దేవా చేశారు. వీబీజీఆర్ ఏఎంజీ చట్టం గురించి రాష్ట్రపతి మాట్లాడేటప్పుడు ప్రతిపక్షం తన ఆందోళనను వ్యక్తం చేసిందని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగించినప్పుడు ప్రతిపక్షం ఆందోళన వ్యక్తం చేయడం దారుణమని కేంద్ర మంత్రి కిరణ్? రిజిజు తప్పుపట్టారు.

**రాష్ట్రపతి ప్రసంగంలో వాస్తవం, జవాబుదారీతనం లేదు: మల్లికార్జున్ ఖర్గే**
రాష్ట్రపతి ప్రసంగంలో వాస్తవం, జవాబుదారీతనం లేదని రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున్? ఖర్గే విమర్శించారు. పేద ప్రజల గురించి ప్రసంగంలో నొక్కి చెప్పారని, కానీ వాస్తవానికి కోట్లాది మంది పేద ప్రజల జీవనోపాధికి ప్రధాన వనరు, పనిహక్కుకు హామీ ఇచ్చే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేశారని విమర్శించారు.

**కొత్తదేమీ లేదు: జాన్ బ్రిట్టాస్**
రాష్ట్రపతి ప్రసంగంలో కొత్తదేమీ లేదని, అన్ని పాత ప్రస్తావనలేనని సిపిఎం రాజ్యసభ పక్షనేత జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. కేంద్ర మంత్రివర్గం తయారు చేసిన ప్రతిని రాష్ట్రపతి చదివి వినిపించారని, అందులో సంఖ్యల్లోనే కొన్ని మార్పులు ఉన్నాయే తప్ప, కొత్తగా ఏమీ లేదని అన్నారు. గతంలో చెప్పినవే రాష్ట్రపతితో పదేపదే చెప్పించారని అన్నారు. దేశంలో రైతులు, కార్మికులు, యువత, మహిళలు, మైనార్టీలు, విద్యార్థుల సమస్యలు, దేశ భద్రత, దేశ ఆర్థిక వ్యవస్థ, నిరుద్యోగం వంటి కీలక సమస్యలను రాష్ట్రపతి విస్మరించారని అన్నారు. దేశంలోని పేదరికం తగ్గించేందుకు కీలక పాత్ర పోషించే, పేదలకు జీవనోపాధిగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేశారని, దాన్ని గొప్పగా చెప్పు కుంటునే, మరోవైపు పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టు బడి ఉందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.

**ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ రద్దు, సర్ కేంద్రాన్ని నిలదీయాలి : ప్రతిపక్షాల పార్టీల సమావేశంలో నిర్ణయం**
పార్లమెంటు బడ్జెట్ సమావేశంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ రద్దు, సర్ అంశాలను లేవనెత్తాలని ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం, కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చల్లో పాల్గొంటూ ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలపాలని నిర్ణయించాయి. బుధవారం పార్లమెంట్‌లో రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఛాంబర్‌లో ఇండియా బ్లాక్‌కు చెందిన ప్రతిపక్ష పార్టీల నాయకులు సమావేశం జరిగింది. బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు అనుసరించా ల్సిన వ్యూహంపై చర్చించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా, కేంద్ర బడ్జెట్ సమర్పణ, చర్చ సమయంలో కూడా నాయకులు నిరసన తెలియజేయాలని నిర్ణయించారు. "ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పునరుద్దరణను డిమాండ్ చేయడానికి ప్రతిపక్షం అన్ని ప్రజాస్వామ్య మార్గాలను ఉపయోగిస్తుంది" అని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ ఎంపీ జైరామ్ రమేశ్ అన్నారు. ఈ సమావేశంలో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు రమేష్, కేసీ వేణుగోపాల్, డీఎంకే ఎంపీ టిఆర్ బాలు, శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్, ఎస్పీ ఎంపీ జావేద్ అలీ ఖాన్, ఆర్జేడి ఎంపీ ప్రేమ్ చంద్ గుప్తా, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, సీపీఐ ఎంపీ పి. సంతోష్, తదితరులున్నారు.

# సంపాదకీయం

## భారత్ బిగ్ డీల్... కుళ్లుకుంటున్న అమెరికా



అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఏడాది పాలన పూర్తి చేసుకున్నారు. తన ఏడాది పాలనలో ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధిస్తూ కాలం వెల్లదీశాడు. మిత్రులు, శత్రువు అనే తేడా లేకుండా 5 నుంచి 200 శాతం వరకు టారిఫ్‌లు విధించారు. దీంతో ప్రపంచంలో చాలా దేశాలు ఈ టారిఫ్‌ల కారణంగా ఇబ్బంది పడుతున్నాయి. చాలా మంది ఉపాధి కోల్పోయారు. భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. దీంతో చాలా కంపెనీలు ఉత్పత్తి తగ్గించాయి. ఉద్యోగులను తగ్గించాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, సౌత్ ఆఫ్రికాతోపాటు అనేక చిన్న దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నారు. తాజాగా అమెరికాకు సన్నిహితంగా ఉండే యురోపియన్ యూనియన్‌ను మోదీ తన బుట్టలో వేసుకున్నాడు. అమెరికా అధ్యక్షుడు మాటను లెక్క చేయకుండా ఈయూ భారత్‌తో అతిపెద్ద వాణిజ్య ఒప్పందానికి సిద్ధమైంది. భారత్?యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌ఏటీ) ద్వారా లక్షలాది మందికి పెద్ద అవకాశాలు లభిస్తాయని నరేంద్రమోదీ ప్రకటించారు. ఇది అంతర్జాతీయ వ్యాపారంలో మూడింట ఒక భాగాన్ని కలిగి ఉంటుందని వివరించారు. ఇండియా ఎనర్జీ వీక్ (ఐఈడబ్ల్యూ) నాల్గవ సంప్రదింపు ప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ, దేశంలో ఇంధన రంగంలో డిమాండ్ ఊపందుకుంటోందని, ఈ ఒప్పందం ద్వారా పెద్ద స్థాయి పెట్టుబడులు ఆకర్షిస్తామని చెప్పారు. ఇది ఉమ్మడి ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేస్తూ, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలను పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.వాస్తవానికి అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఎప్పుడో జరగాల్సింది. కానీ అమెరికా కోసం మన దేశ రైతులను పణంగా పెట్టేందుకు మోదీ అంగీకరించడం లేదు. అనేక అంశాల్లో ఏకాభిప్రాయం రావడం లేదు. దీంతో వాణిజ్య చర్చలు నెలల తరబడి సాగుతున్నాయి. దీంతో భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం తగ్గించేందు మోదీ ఒక అడుగు ముందుకు వేసి ప్రపంచ దేశాలతో చర్చలు ప్రారంభించారు. ఒప్పందాలూ చేసుకుంటున్నారు. భారత్?ఈయూ ఒప్పందం కూడా ఇందులో భాగమే. అయితే దీనిని చూసి ఇప్పుడు అమెరికా కుళ్లుకుంటోంది. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్, తమ దేశం రష్యా?ఉక్రెయిన్ సంఘర్షణను అరికట్టేందుకు ఎక్కువ రాజీలు చేసుకున్నామని, భారత్‌పై చమురు దిగుమతులకు అదనపు పన్నులు విధించామని గుర్తు చేశారు. అయినా ఈయూతో భారత్ సులభంగా ఒప్పందం కుదుర్చుకుందని విమర్శించార. తమ సహకారానికి తగిన గుర్తింపు లభించలేదని ఆక్షేపించారు. ఇది అంతర్జాతీయ వాణిజ్యంలో దేశాల మధ్య పోటీతత్వాన్ని, భౌగోళిక రాజకీయాల ప్రభావాన్ని సూచిస్తోంది.ఈ ఒప్పందం ఈయూ? భారత్‌కు యూరప్ మార్కెట్లలో సులభ ప్రవేశం అందిస్తూ, ఎక్స్‌పోర్ట్‌లను పెంచుతుంది. ఇంధన, ఆటో, టెక్ రంగాల్లో పెట్టుబడులు పెరిగి, ఆర్థిక వేగాన్ని పెంచవచ్చు. అయితే, అమెరికా విమర్శలు భవిష్యత్ వాణిజ్య ఒప్పందాల్లో టెన్షన్లను సృష్టించవచ్చు. రష్యా చమురు విషయంలో భారత్ స్వతంత్ర విధానం కొనసాగితే, యూఎస్‌తో సంబంధాలు బలపడే అవకాశం ఉంది. మొత్తంగా, ఈ డెవలప్‌మెంట్ భారత్ గ్లోబల్ ఆర్థిక శక్తిగా ఎదగడానికి సహాయపడుతుంది, ఇతర దేశాలు కూడా భారత్‌వైపు చూసేలా చేస్తుంది.మరో వైపు యూరప్‌లో తయారైన కార్లు (జెర్మన్, ఇటాలియన్ మోడల్స్) ధరలు 20?30% వరకు దిగవచ్చు. ఆలివ్ ఆయిల్, కివీ పండ్లు వంటి ఆహార పదార్థాలు, విస్కీ, వోడ్కా, బీర్, వైన్ లాంటి పానీయాలు, సిద్ధాంగా ప్రాసెస్ చేసిన ఫుడ్ ఐటెమ్స్, పండ్ల రసాలు అందరికీ చౌక అవుతాయి.

ఇలాంటి మార్పు ద్వారా మధ్యతరగతి కుటుంబాల ఖర్చులు తగ్గి, జీవన ప్రమాణాలు మెరుగవుతాయి.భారత్ ఎగుమతి చేసే వస్తువుల్లో 90 శాతానికిపైగా యూరోపియన్ మార్కెట్లలో సుంకాలు ఉండవు. టెక్స్‌టైల్స్ రంగం (కాటన్ గార్మెంట్స్, సారీలు, హ్యాండ్‌లూమ్) పెద్దగా ప్రయోజనం పొందుతుంది, ఇటలీ, ఫ్రాన్స్ మార్కెట్లలో డిమాండ్ పెరుగుతుంది. కెమికల్స్ (ఫార్మా ఇంటర్మీడియేట్స్, పెస్ట్‌సైడ్స్) రంగం జర్మనీ, బెల్జియం వర్క్‌షాప్‌లకు సులభ ప్రవేశం పొందుతుంది. ఆభరణాలు (గోల్డ్, డైమండ్ జ్యువెలరీ) స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో ఎగుమతులు దాదాపు రెట్టింపు అవుతాయని అంచనా. ఇవి లక్షలాది ఉద్యోగాలు సృష్టించి, ఎంఎస్ఎంఈలకు బూస్ట్ ఇస్తాయి. మొత్తం వాణిజ్యం వృద్ధి చెంది, జీడీపీ 1 నుంచి 2 శాతం వృద్ధికి దోహదపడవచ్చు.ఈ ఒప్పందం రెండు ప్రాంతాల మధ్య పరస్పర పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. యూరప్ నుంచి టెక్నాలజీ, మెషినరీ దిగుమతులు పెరిగి, భారత పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. భారత్ నుంచి ఐటీ, ఆటో పార్ట్స్ ఎగుమతులు పెరిగి, సరఫరా బలపడుతుంది. అయితే, స్థానిక ఉత్పాదకులు పోటీకి సిద్ధంగా ఉండాలి. మొత్తంగా, ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్‌ను గ్లోబల్ ట్రేడ్ హబ్‌గా మార్చి, మధ్య తరగతి ఆదాయాలను పెంచుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహం గురించి అందరికీ తెలిసిందే. ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు భారత ప్రధాని మోదీతో మంచి స్నేహ సంబంధాలను నెరిపారు. కానీ రెండోసారి అధికారంలోకి వచ్చాక ట్రంప్ అసలు స్వరూపం బయటకు రావడం మొదలైంది. ఆపరేషన్ సింధూర్‌ను తానే ఆపానని ట్రంప్ పదే పదే చెప్పుకున్నారు. భారత్ ఖండించినప్పటికీ అమెరికా అధ్యక్షుడి తీరు మారలేదు. అంతే కాదు పాకిస్థాన్‌తో దోస్తీ చేస్తూ.. భారత్‌పై టారిఫ్‌ల బాంబు వేశారు ట్రంప్.అంతే కాకుండా భారత ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమీ అంటూ ట్రంప్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తమ మాట వినకపోతే భారత్‌కు భవిష్యత్తు లేదనేది ట్రంప్ మాటల ఉద్దేశంగత ఏడాది యూకేతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న భారత్.. న్యూజిలాండ్‌తోనూ ట్రేడ్ డీల్ చేసుకుంది. ఒమన్‌తో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు యూరోపియన్ యూనియన్‌తో ఏకంగా మదర్ ఆఫ్ డీల్స్‌గా చెప్పుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఆస్ట్రేలియా, కెనడా, చిలీ లాంటి దేశాలతోనూ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి భారత్ చర్చలు జరుపుతోంది. తద్వారా అమెరికాకు ప్రత్యామ్నాయ మార్కెట్లు లభించడంతోపాటు.. మనకు అవసరమైన వనరులను ఈ దేశాల నుంచి పొందడానికి అవకాశం కలగనుంది.ట్రంప్ వైఖరి వల్ల భారత్‌తోపాటు యూరప్ దేశాలు సైతం విసిగిపోయాయి. అమెరికా పొరుగు ఉన్న కెనడాకు సైతం అగ్రరాజ్యం తీరు ఏమాత్రం నచ్చడం లేదు. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా నిలబెడతామని టారిఫ్ వార్ మొదలుపెట్టిన ట్రంప్.. ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఇదే సమయంలో అమెరికా తీరుతో విసిగిపోయిన దేశాలు.. బహుళ ధ్రువ ప్రపంచం దిశగా వేగంగా అడుగులేస్తున్నాయి. ఇందులో భారత్ కీలక పాత్ర పోషిస్తోంది.

# అరవ శ్రీధర్‌పై విచారణ షురూ



**కడప - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఏపీలో కూటమి ప్రభుత్వంలో కీలకమైన పార్టీగా ఉన్న జనసేన ఎమ్మెల్యేకు సంబంధించిన ఒక వీడియోను వైసీపీ బయట పెట్టింది. ఆ వీడియో అత్యంత దారుణంగా ఉంది. అందులో మాట్లాడిన భాష కూడా అత్యంత హేయంగా ఉంది. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్‌కు సంబంధించిన ఒక వీడియోను వైసీపీ బయట పెట్టింది.." ఏడాది క్రితం నుంచి ఒక మహిళను వేధిస్తున్నాడు. ఉద్యోగం పేరుతో ఆమెను ఇబ్బంది పెడుతున్నాడు. 2024 శాసనసభ ఎన్నికల్లో శ్రీధర్ రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి గెలిచారు. ఆయన గెలిచిన తర్వాత ప్రభుత్వ శాఖలో కిందిస్థాయి ఉద్యోగిగా పని చేస్తున్న ఓ మహిళ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేసింది. ఆ సందేశానికి శ్రీధర్ రిప్లై కూడా ఇచ్చారు.. ఇక అప్పట్నుంచి ఆమెతో శ్రీధర్ చనువు పెంచుకున్నారు. నీతో మాట్లాడాలి.. వ్యక్తిగతంగా కలవాలి అంటూ ఆమెకు అనేక సందర్భాలలో మెసేజ్ పెట్టారు. దీంతో ఆమె ఆందోళనకు గురైంది. ఆ తర్వాత ఎమ్మెల్యే గారూ ఇలా అంటున్నారు అంటూ సమాధానాన్ని దాట వేసిందని" వైసిపి ఆ వీడియోను ఉద్దేశించి వ్యాఖ్యానించింది." నీ పేరు ఏంటి? తల్లిదండ్రులు ఎవరు? ఎక్కడ ఉద్యోగం చేస్తున్నారు? వివాహం జరిగిందా? భర్త ఏం చేస్తుంటాడు? పిల్లలు ఎంతమంది? మీ వయసు ఎంత? మీ ఇంటి చిరునామా చెప్పండి" అంటూ శ్రీధర్ ఆమె వివరాలు తీసుకున్నాడని వైసిపి పేర్కొంది." ఆమె చెప్పిన వివరాల ఆధారంగా.. ఆ మహిళకు పేరెంట్స్ లేరని ఎమ్మెల్యే తెలుసుకున్నాడు. ఆమె భర్త ఐటి ఉద్యోగిగా హైదరాబాదులో పని చేస్తున్నాడని గుర్తించాడు. ఒకరోజు ఆమె ఇంటికి వెళ్ళాడు. ఆమెను కారులో ఎక్కించుకొని తీసుకెళ్లాడు. మార్గం మధ్యలో ఒక గ్రామం సమీపంలో ఆమె మీద బలాత్కారం చేయబోయాడు. ఆమె వారించినప్పటికీ.. జుట్టు పట్టుకొని కారులోనే దారుణం చేశాడు. అంతేకాదు పలుమార్లు ఆమెపై ఇలానే చేశాడు. ఆ తర్వాత భర్తకు విడాకులు ఇవ్వాలని ఒత్తిడి తీసుకొచ్చాడు. పెళ్లి చేసుకుంటానని బెదిరించాడు. దానికి ఆమె ఒప్పుకోక పోవడంతో ఇబ్బంది పెట్టాడు. ఆమె భర్తకు ఫోన్ చేసి బీభత్సం సృష్టించాడు. దీంతో ఆ మహిళకు, భర్తకు విభేదాలు ఏర్పడ్డాయి. తాను చెప్పినట్టు విడాకులు ఇవ్వకపోతే ఆ మహిళ మూడు సంవత్సరాల కుమారుడిని చంపేస్తానని హెచ్చరించాడు. పథకాలంగా శ్రీధర్ ఇలా వేధిస్తూ ఉండడంతో ఆ మహిళ తట్టుకోలేకపోయింది. చివరికి ఆ వివరాల మొత్తం బయట పెట్టింది. జనసేన ఎమ్మెల్యే ఈ స్థాయిలో అరాచకానికి పాల్పడడాన్ని చూస్తుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందో అర్థం చేసుకోవచ్చని" వైసీపీ సోషల్ మీడియా పేర్కొంది.

### నా కొడుకు చాలా మంచోడు

జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మీద వచ్చిన ఆరోపణలపై ఆయన తల్లి ప్రమీల స్పందించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అయిన అరవ శ్రీధర్ వీడియో అంటూ వైసీపీ ఓ వీడియో రిలీజ్ చేసింది. ఆ తర్వాత ఆ వీడియోలో ఉంది తానేనంటూ ఓ మహిళ వీడియో రిలీజ్ చేసింది. ఈ వీడియోలో అరవ శ్రీధర్ మీద లైంగిక వేధింపులు, అత్యాచారం ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో ఈ ఆరోపణలపై అరవ శ్రీధర్ తల్లి స్పందించారు. విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మహిళ ఆరోపణలను ఖండించారు. రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మీద మహిళ లైంగిక ఆరోపణల వ్యవహారం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మహిళ ఆరోపణలపై ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తల్లి ప్రమీల స్పందించారు. తన కుమారుడిపై వచ్చిన ఆరోపణలపై మంగళవారం సాయంత్రం ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ ఆరోపణలను అరవ శ్రీధర్ తల్లి తీవ్రంగా ఖండించారు. ఆ మహిళ కులం పేరు చెప్పిన తన కుమారుడికి దగ్గరైందని చెప్పుకొచ్చారు. ఆ తర్వాత ఇంటికి రావటం మొదలు పెట్టిందని.. పగలు, రాత్రీ తేడా లేకుండా ఫోన్లు కూడా చేసేదని ఆరోపించారు. అరవ శ్రీధర్‌ను పెళ్లిచేసుకోమంటూ చాలాసార్లు బ్లాక్ మెయిల్ చేసిందని ఎమ్మెల్యే శ్రీధర్ తల్లి ప్రమీల ఆరోపించారు. సాయం కోసం వచ్చి.. తన బిడ్డను అభాసుపాలు చేసిందంటూ అరవ శ్రీధర్ తల్లి ప్రమీల ఆరోపించారు.ఆడపిల్ల జీవితం నాశనం చేయకూడదనే ఉద్దేశంతో ఇప్పటి వరకూ ఓపికగా ఉన్నామని అన్నారు. మహిళ వేధింపులపై జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశామని ప్రమీల చెప్పుకొచ్చారు. .ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంలో ఎవరు నిజం.. ఎవరు అబద్ధమనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు జనసేన ఎమ్మెల్యే అయిన అరవ శ్రీధర్ మీద ప్రభుత్వ ఉద్యోగిని అయిన ఓ వివాహిత ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఫేస్‌బుక్ ద్వారా కలిగిన పరిచయాన్ని ఆసరాగా తీసుకుని అరవ శ్రీధర్ తనను బెదిరించి.. అత్యాచారం చేశారంటూ సంచలన ఆరోపణలు చేసింది. ఆ తర్వాత గర్భం దాల్చితే పెళ్లి చేసుకుంటానని నమ్మించి అబార్షన్ కూడా చేయించారంటూ ఆరోపించటం తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది.

అలాగే అరవ శ్రీధర్‌విగా చెప్తున్న వీడియోలను కూడా సోషల్ మీడియాలో వైసీపీ షేర్ చేసింది. అలాగే అరవ శ్రీధర్ మీద చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ మహిళా కమిషన్ సైతం జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం మీద స్పందించింది. ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ ఈ వ్యవహారంపై స్పందించారు. రాయపాటి శైలజ బాధితురాలితో ఫోన్ ద్వారా మాట్లాడినట్లు తెలిసింది. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# లోకేష్‌కు, పవన్‌కు ప్రమోషన్



**విజయవాడ - సూర్య వాస్తవం**

ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతోంది. మరో నెలలో రెండేళ్ల పాలన పూర్తవుతుంది. ఇప్పటివరకు సజావుగా పూర్తి చేసామన్న సంతృప్తి కూటమిలో ఉంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని చెబుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో రాజకీయ నిర్ణయాల దిశగా కూటమి ముందుకు వెళ్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. మంత్రి నారా లోకేష్ ప్రమోషన్, పట్టాభిషేకం వంటి ప్రచారం సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. ఇటువంటి తరుణంలో పవన్ పాత్ర ఎలా ఉండబోతుంది అనేది చర్చ. ఒకవేళ లోకేష్ కు ప్రమోషన్ కల్పించాలంటే పవన్ నుంచి అభ్యంతరం రాదా? అనే చర్చ కూడా బలంగా సాగుతోంది. అయితే ఏది ఏమైనా మూడు పార్టీలు కలిసి ముందుకెళ్లాలని బలంగా నిర్ణయించుకున్నాయి. అందుకే కూటమి అంతర్గత నిర్ణయాలు సైతం మూడు పార్టీల మధ్య జరగాలన్నది ఒక ప్రతిపాదనగా ఉన్నట్లు తెలుస్తోంది.2027 ద్వితీయార్థంలో మంత్రి నారా లోకేష్ ప్రమోషన్ ఉంటుందన్న చర్చ నడుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవితో పాటు డిప్యూటీ సీఎం హోదా కల్పిస్తారని టాక్ నడుస్తోంది. కానీ ఇప్పటికే పార్టీ పై పూర్తిస్థాయిలో పట్టు సాధించారు లోకేష్. ఆపై తన మంత్రి పదవి విషయంలో సైతం సక్సెస్ అయ్యారు. పెట్టుబడుల సాధన, పరిశ్రమల ఏర్పాటు వంటి విషయంలో విజయం సాధించారు. తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. అదే సమయంలో బిజెపి అగ్ర నేతల ఆశీస్సులు కూడా అందుకున్నారు. వారి అభిమానాన్ని చూరగొన్నారు. అయితే ఏకంగా లోకేష్ కు ముఖ్యమంత్రి పదవి కట్ట పెడతారన్న ప్రచారం నడుస్తోంది. అయితే అంతటి సాహసానికి దిగుతారా అనేది చర్చ. ఎందుకంటే అమరావతి రాజధానిని ప్రాధాన్యత ప్రాజెక్టుగా తీసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రపంచ దిగ్గజ సంస్థల ఏర్పాటు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అధికార మార్పిడి జరిపితే దాని ప్రభావం తప్పకుండా ఉంటుంది. అందుకే ఇందులో ఎంత మాత్రం నిజం లేదని తెలుస్తోంది.రాష్ట్రంలో లోకేష్ ప్రమోషన్, పవన్ కళ్యాణ్ కు ప్రత్యామ్నాయ అవకాశాలు జరగాలంటే 2029 ఎన్నికల తరువాతే. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఏపీలో మంత్రిగా ఉన్నారు. ఆపై డిప్యూటీ సీఎం హోదాలో కొనసాగుతున్నారు. మరోవైపు సనాతన ధర్మం అంటూ జాతీయ స్థాయిలో సైతం ప్రభావం చూపుతున్నారు. తరచూ వివిధ రాష్ట్రాలను సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో సైతం వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో పవన్ కళ్యాణ్ ద్వారా రాజకీయం చేయాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. ఈ పరిస్థితులు చూస్తుంటే 2029 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఎంపీగా పోటీ చేసి కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లడం ఖాయమని తెలుస్తోంది. కేంద్ర క్యాబినెట్ లో కీలక బాధ్యతలు కట్టబెట్టి జాతీయస్థాయి రాజకీయాల కోసం పవన్ కళ్యాణ్ ను వాడుకుంటారు అన్న చర్చ జోరుగా సాగుతోంది.2029 సార్వత్రిక ఎన్నికలతోపార్టీ ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. మూడు పార్టీలు ఉమ్మడిగా ముందుకు వెళ్తాయి. పవన్ కళ్యాణ్ ఎంపీగా పోటీ చేస్తారు. లోకేష్ తిరిగి అసెంబ్లీకి పోటీ చేస్తారు. కూటమి తప్పకుండా అధికారంలోకి వస్తుందన్న నమ్మకం వారిలో ఉంది. అప్పుడు కూడా చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టడం ఖాయం. కేంద్రంలో పవన్ కళ్యాణ్ తిరుగులేని శక్తిగా ఉంటారు. ఏపీలో కూటమికి రక్షణ కవచంగా నిలుస్తారు. అటువంటి సమయంలో చంద్రబాబు వయసు దృష్ట్యా సీఎం పదవి నుంచి తప్పుకుంటే లోకేష్ కు పట్టాభిషేకం చేయడం ఖాయం. కేంద్ర పెద్దల భరోసాతో, పవన్ కళ్యాణ్ సమ్మతితో ఇది జరిగే అవకాశం ఉంది. అంటే రాష్ట్రంలో పదవుల మార్పు అనేది 2029 ఎన్నికల్లో విజయాలను అనుసరించి ఉంటుంది. అంతవరకు ఎటువంటి మార్పు ఉండదు అన్నది విశ్లేషకుల మాట. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# పార్టీ అధిష్టానమే మనకు సుప్రీం

- పార్టీ మనుగడ కోసం సైనికుల్లా పని చేద్దాం
- పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు అధిష్టానమే కేటాయిస్తుంది
- కార్యకర్తలకు హితబోధ చేసిన టిడిపి సీనియర్ నేతలు
- మండల పార్టీ కార్యాలయంలో తొలి ఐటిడిపి సమావేశం నిర్వహణ



**శాంతిపురం - సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిందని అలాంటి పార్టీకి చెడ్డ పేరు తీసుకొచ్చే పని ఎవరూ ఎప్పటికీ చేయొద్దని ఆ పార్టీ సీనియర్ నేతలు కార్యకర్తలకు హితవు పలికారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం బుధవారం శాంతిపురం మండల టిడిపి కార్యాలయంలో మొదటి ఐటీడీపీ సమావేశం నిర్వహించారు.ఈ సమా వేశానికి మండలంలోని 23 గ్రామపంచాయతీ ఐటీడీపీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన గ్రామపంచాయతీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈ సమావేశంలో పార్టీ విధి విధానాల గురించి క్లుప్తంగా నేతలు వివరించారు. పార్టీ మనుగడ కోసం విలువలతో కూడిన రాజకీయ చేద్దామని స్పష్టం చేశారు. ఆది నుంచి పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను ఉన్నత స్థానంలో నిలబెట్టే ప్రయత్నం అధిష్టానం చూసుకుంటుందని చెప్పారు. అధిష్టానం ఆదేశానుసారం నడుచుకోవాలని సూచించారు. రానున్న 15 సంవత్సరాలు కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండేలా ప్రతి కార్యకర్త నేతలు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శాంతిపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిగం ఉదయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ జి ఎన్ రాజేంద్రప్రసాద్, మాజీ క్లస్టర్ లు ఇ. జనార్ధన్ రెడ్డి, చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మంజునాథ్ గౌడు,లు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ కనీస వేతనాల డైరెక్టర్ శరవణ, ఏపీ మొదలియార్ డైరెక్టర్ వినోద్ కుమార్ మూర్తి, కుప్పం నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు రామ్మూర్తి, శాంతిపురం మండల తెలుగు యువత బాలాజీ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శివ, శాంతిపురం మండల ఐటిడిపి అధ్యక్షులు మంజునాథ్, ప్రధాన కార్యదర్శి సాగర్, శాంతిపురం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సామలూరు సామేలు నేత్రదానం

## - ఇద్దరు అంధులకు చూపు





**పులివెందుల– సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని క్రిస్టియన్ లైన్‌కి చెందిన సామలూరు సామేలు (75 సంవత్సరాలు) మరణించ డంతో ఆయన భార్య కమలమ్మ, తమ్ముడు యేసయ్య,అక్క జయమ్మ, చెల్లెలు అన్నమ్మ, మనవడు అఖిల్ రాజ్‌లు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు లకు సమాచారం ఇవ్వడం తో టెక్నీషియన్ ప్రశాంత్ కుమార్ తో కలిసి మృతుని నివాసం వద్ద పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించి కడప ఎల్ వి ప్రసాద్ నేత్రాలయానికి పంపినట్లు రాజు తెలిపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ప్రతి కుటుంబం నేత్రదానం పై అవగాహన కలిగి కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు ఎవరు మరణించిన 9966500364 కి సమాచారం ఇచ్చి ఒక మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వం తో బాధ పడుతున్న ఇద్దరు అంధులకు చూపు ఇచ్చి మరణించిన తరువాత కూడా ఈ ప్రపంచాన్ని చూపే బృహ త్కార్యం నేత్రదానం ఒక్కటే కావున నేత్రదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

# హరిహర పుత్రునికి అభిషేకాలు

## - ప్రత్యేక అలంకారంలో అయ్యప్ప స్వామి



**పులివెందుల– సూర్య వాస్తవం:** పులివెందుల పార్నపల్లి రోడ్డు కోతి సమాధి వద్ద కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వ హించారు. బుధవారం ఉదయాస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు సాయి మధు గురుస్వామి వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన బిల్వ అర్చన, అష్టోత్ర శతనామావళి తదితర పూజ కైకర్యాల అనంతరం అయ్యప్ప స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గురుస్వామి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో కార్తీక మాసం, 365 రోజులలో ప్రతి నిత్యము బుధవార రోజులలో స్వామివారికి విశేష పూజలు ధూప దీప నైవేద్యాలు భక్తుల సహాయ సహకారాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడంగ జరుగుతోందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను అయ్యప్ప స్వాములకు భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు ధార్మిక విలువలు నేర్పాలి

## - గణపతి సచ్చిదానంద స్వామీజీ





**పామిడి– సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలోని శ్రీ అనఘా దత్తాత్రేయ పాదుకా క్షేత్రంలో సర్వ దేవతలకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామీజీ సందేశమిచ్చారు. దేవాలయ దర్శనాన్ని ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని, కనీసం శుక్ర, శనివారాల్లోనైనా ఆలయాలను దర్శించుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని అన్నారు. మనము సంపాదించిన ధనంలో కొంత భాగాన్ని ఆలయాల అభివృద్ధికి, దైవిక కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. మన వెంట ఈ లోకంనుంచి ఏదీ తీసుకుపోమని, అయినా భౌతిక సుఖసంతోషాల వెనుక పరితపిస్తూ దైవకార్యాలకు దూరమవుతున్న పరిస్థితిపై స్వామీజీ ఆందోళన వ్యక్తం చేశారు. గురువుల మార్గదర్శకాన్ని అనుసరించి జీవించడమే సార్థక జీవితం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీకి పూర్ణకుంభంతో ఆలయ కమిటీ అధ్యక్షురాలు సీతమ్మ, కార్యదర్శులు, లక్ష్మీనారాయణ రెడ్డి, శ్రీధర్, ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ దత్తాత్రేయ స్వామి, అనఘా దేవి, కార్యసిద్ధి ఆంజనేయ స్వామి, నవగ్రహ దేవతలకు పూజలు, హారతులు నిర్వహించారు. ఫిబ్రవరి 2న పామిడిలో నిర్వహించనున్న భోగేశ్వర కల్యాణం ఘనంగా, విజయ వంతంగా జరగాలని స్వామీజీ దివ్య ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తాతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

# మూడు రోజుల పర్యటన ఖరారు

### - ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎస్పీలు



**కుప్పం– సూర్య వాస్తవం:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెలాఖరులో 30,31, ఫిబ్రవరి 1వ తేదీన కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ను ఖరారు చేశారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 30న శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు గుడిపల్లి మండలంలోని అగస్త్య విజ్ఞాన కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. గుడిపల్లి మండల పరిధిలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం కుప్పం మున్సి పాలిటీ పరిధిలో పర్యటిస్తారు. కుప్పం పరిధిలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పున్నమి రెస్టారెంట్‌ను ముఖ్యమంత్రి పునః ప్రారంభించను న్నారు. అనంతరం కుప్పం మున్సిపల్ పరిధిలో బైపాస్ మార్గంలో ఓ ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేసిన నైపుణ్యా భివృద్ధి శిక్షణా కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం శాంతిపురం మండలంలోని కడపల్లి వద్ద ఉన్న తన స్వగృహంలో రాత్రికి బస చేయనున్నారు. 31న శనివారం తన స్వగృహం వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం కుప్పం మండలంలోని కంగుంది పర్యాటక అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. అనంతరం శాంతిపురం మండలం తులసి నాయన పల్లి వద్ద ఏర్పాటుచేసిన ప్రజా వేదిక సభలో పాల్గొనున్నారు. అనంతరం లబ్ధిదారులకు ఎలక్ట్రిక్ సైకిళ్ళు, నూతన పింఛన్లు అందజేస్తారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ఉదయం తన స్వగృహం వద్ద ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నారు. అనంతరం జిల్లా అధికారులు



ప్రజాప్రతినిధులు నాయకులతో కుప్పం నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం తుమిసి రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన హెలిపాడ్ చేరుకొని తిరుగు ప్రయాణం కానున్నారు.?

**ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మూడు రోజుల కుప్పం పర్యటనపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వ హించారు. స్థానిక కళా కార్యాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ జిల్లా ఎస్పీ తుషార్ డూడీ,కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, లతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పా ట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శంకు స్థాపన, ప్రారంభోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయ కులు కార్యకర్తలతో సీఎం సమావేశమవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి తన పర్యటనలో భాగంగా ప్రజలకు సామాజిక భద్రత పింఛను పంపిణీ చేస్తారని అనంతరం వ్యవసాయ అనుబంధ రంగాలపై సీఎంతో ప్రత్యేక సమీక్ష ఉంటుందని వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఆయా శాఖల అధికారులు అందరూ హంద్రీనీవా, సంజీవని, ప్రాజెక్టులు, కుప్పం అభివృద్ధికి సంబంధించిన సంబం ధించిన నివేదికలు సంసిద్ధంగా ఉంచు కోవాలని సూచిం చారు. అనంతరం కలెక్టర్ ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సమీక్షా కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, కడపిడి వికాస్ మర్మత్, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## తెలుగుదేశం పాలనలో

# తెలుగు భాషకు చంద్రగ్రహణం సిగ్గుచేటు

### - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** తెలుగుదేశం పాలనలో రాష్ట్రంలో తెలుగు భాషకు చంద్రగ్రహణం పట్టడం అత్యంత దురదృష్టకరం, శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. బుధవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం 2019 నవంబర్ 20వ తేదీన పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ దాని స్థానంలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ జీవో 85 జారీ చేసిందన్నారు. ఇది ఒక చారిత్రాత్మ కమైన తప్పిదమైన జీవో కాగా ఆ జీవోను ప్రస్తుతం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తూ ఉండడం మరింత దురదృష్టకరం, శోచనీయం అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే మధురమైన మన మాతృభాష తెలుగు భాష అనతి కాలములోనే మృతభాషగా మారుతుందన్నారు. ప్రపంచంలో 200 పైచిలుకు దేశాలు ఉండగా అభివృద్ధి చెందిన దేశాలతో పాటు ప్రతి దేశం కూడా పాఠశాల విద్యను ప్రత్యేకించి ప్రాథమిక విద్యను తమ తమ పిల్లలకు మాతృభాషలోనే బోధన చేస్తున్నాయన్నారు. భారతదేశంలో 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలు ఉండగా ఒక్క ఆంధ్రప్రదేశ్ తప్ప మిగతా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రాథమిక విద్యను తమ పిల్లలకు తమ తమ మాతృభాషలోనే బోధిస్తున్నాయన్నారు. దేశంలోనే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్లో తెలుగు భాషకు ఈ దుస్థితి రావడం విడ్డూరం. స్వర్గీయ ఎన్టీ రామారావు తెలుగు భాష,తెలుగు జాతి, తెలుగువారి ఆత్మగౌరవం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించారు.అటువంటి తెలుగుదేశం పాలనలో తెలుగు భాషకు ఈ దుర్గతి రావడం అత్యంత విచారకరం. జాతిపిత మహాత్ముడు, విశ్వకవి రవీంద్రుడు క్షిపని పితా మహుడు అబ్దుల్ కలాం,రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వీరందరు కూడా ప్రాథమిక విద్యను మాతృభాషలోనే బోధించాలని చెప్పారు. విద్యా హక్కు చట్టం,జాతీయ విద్యా విధానం, భారత రాజ్యాంగంలో 350 ఏ అధికరణ, యునెస్కో, ఐక్యరాజ్యసమితి ఇవన్నీ కూడా మాతృభాషకు పెద్దపీట వేశాయి. ఒక అంశం మీద ఒక విద్యార్థి ఒక గంటలో మాతృభాషలో అవగాహన చేసుకుంటే ఇతర భాషల్లో అదే అంశాన్ని అవగాహన చేసుకోవాలంటే నాలుగు గంటలు పడుతుందని మనో విశ్లేషకులు చెబుతున్నారు. నోబెల్ ప్రైజ్ గ్రహీతలు అందరూ కూడా ప్రాథమిక విద్యను తమ తమ మాతృభాషలోనే నేర్చుకున్న వారే. శ్వాస ఆగిపోతే మనిషి చస్తాడు.భాష ఆగిపోతే జాతిచస్తుందని తులసి రెడ్డి అన్నారు.

**డిమాండ్లు.**

1. గత వైకాపా ప్రభుత్వం జారీచేసిన జీవో 85ను కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి.
2. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలి.
3. తెలుగు మధ్యమంలో చదివిన వారికి ఉన్నత విద్య ప్రవేశాలలో ఉద్యోగాలలో రెండు శాతం వెయిటేజ్ మార్కులు కలపాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

## అర్బన్ సీఐగా సంగమేశ్వర రావు

# అదనపు బాధ్యతలు స్వీకరణ



**నాయుడుపేట– సూర్య వాస్తవం:** నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న బాబి స్థానంలో, నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వర రావు బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ సంగమేశ్వర రావు మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఇటువంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, చట్టాన్ని గౌరవిస్తూ ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. నాయుడుపేట పట్టణంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కల్పవృక్ష వాహనంపై శ్రీవేంకటరమణుడు



**పులివెందుల– సూర్య వాస్తవం:** పులివెందులలో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఐదవ రోజు వేంకటరమణుడు సతీసమేతుడై ఆనంద పర్వంలో తేలియాడుతూ కల్పవృక్ష వాహనంపై భక్తులకు కనువిందు చేశారు. దేవదేవుని దర్శించుకునేందుకు భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. రకరకాల పండ్లతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో కొలువుతీరిన స్వామి సతీసమేతుడై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి గ్రామోత్సవంలో పురవీధులలో భక్తులు గోవిందనామ స్మరణలతో తమ భక్తిని చాటుకున్నారు. మంగళవాయిద్యాల మధ్య స్వామివారు ఊరేగుతుంటే.. స్వామి దివ్య మంగళ స్వరూపాన్ని చూసి భక్తులు తరించారు. రాత్రి స్వామివారు సర్వభూపాల వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి ఐదు శేషుల పడగలపై నాట్యం చేస్తున్నట్లు కనిపించే తీరు భక్తులను ఆకట్టుకుంది. మహిళలు స్వామివారి రథాన్ని లాగుతూ గోవిందా.. గోవిందా నామజపాలతో ముందుకు కదిలారు. భక్తులు కాయ, కర్పూరాలు సమర్పించి వేడుకున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ
- మార్నింగ్ విత్ ఎమ్మెల్యేలో సాయి నగర్, సరసమ్మ కట్ట ప్రాంతాల పరిశీలన



**పెళ్లకూరు – సూర్య వాస్తవం :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వెంటనే పరిష్కార చర్యలు చేపట్టడమే తన లక్ష్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. బుధవారం సూళ్లూరుపేట పట్టణంలో నిర్వహించిన 'మార్నింగ్ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా ఆర్డీఓ కార్యాలయం సమీపంలోని సాయి నగర్, సరసమ్మ కట్ట ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి స్థానికులను పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్య లోపాలు, మౌలిక సదుపాయాల కొరతపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే, ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలను పునరుద్ధరించి, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ విలేకరులతో మాట్లాడుతూ, సాయినగర్, సరసమ్మ కట్ట ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రజల చెంతకే పాలన తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని, సూళ్లూరుపేటను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. మానవత ఆధ్వర్యంలో బుధవారం జెడ్పి ఉన్నత బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మానవతా విలువలు పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి మొదటి బహుమతి 1000 రెండో బహుమతి 500 మూడో బహుమతి 300 విద్యార్థులకు నగదు రూపంలో కన్వీనర్ శివయ్య ఉపాధ్యక్షుడు పకీరయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి 25 వేల రూపాయలు అందజేస్తున్నామని అలాగే పేద విద్యార్థి చదువుకుంటూ ఆర్థికంగా ఇబ్బంది పడిన వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని అన్నారు. అంతే కాకుండా అనారోగ్యంతో బాధపడే వారికి కూడా మానవతా తరపున ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో మండల ఫస్ట్ వచ్చిన వారికి మానవతా తరపున ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఖజానాకు రెవెన్యూను అందించే శాఖలు

# రెవెన్యూ ఆదాయ లక్ష్యాలను అధిగమించాలి

- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** జిల్లాలో రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని అందించే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, రిజిస్ట్రేషన్, అటవీ శాఖ, పంచాయతీ రాజ్, మునిసిపల్ శాఖ, రవాణా శాఖలకు కేటాయించిన వార్షిక ఆదాయ లక్ష్యాలను వందశాతం సాధించడమే కాకుండా అధిగమించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత శాఖాధికారు లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదాయ వనరుల పెంపుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని శాఖల వారీగా ఆదాయ సాధన పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఆదాయం సృష్టించే శాఖల్లో వనరుల సమర్థ వినియోగం, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, లక్ష్య సాధనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేటాయించిన లక్ష్యాలను సాధించడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకుంటూ ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఆదాయాన్ని పెంచడం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ప్రతినెల దీనిపై సమీక్ష సమావేశం సంబంధిత శాఖలతో జరుగు తుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటూ రెవెన్యూ ఆదాయ శాఖల్లో వృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదాయం తెచ్చిపెట్టే వనరులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, లక్ష్య సాధనలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా కట్టుదిట్టంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

# గ్రూప్ - 2కు ఎంపికైన ఎద్దుల మురళీధర్ రెడ్డి



**వేముల– సూర్య వాస్తవం:** బుధవారం విడుదలైన గ్రూప్ – 2 ఫలితాలలో వేముల మండలం గొల్లలగూడూరు గ్రామానికి చెందిన ఎద్దుల జగన్ మోహన్ రెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు ఎద్దుల మురళీధర్ రెడ్డి గ్రూప్ – 2 ఉద్యోగానికి సెలెక్ట్ అయ్యాడు. విజయవాడలోని సెక్రటేరియట్‌లో 'అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా' ఉద్యోగ బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. తను ఎన్నికైన సందర్భంగా తల్లిదండ్రులు, బిందువులు, స్నేహితులు హర్షం వ్యక్తం జేశారు.ం

# నేడు రామాపురం క్షేత్రంలో ఉత్తర ద్వార దర్శనం



**కమలాపురం – సూర్య వాస్తవం :** కమలాపురం మండలం శ్రీరామాపురం పుణ్య క్షేత్రంలో గురువారం నాడు శ్రీ మహాలక్ష్మీ మోక్ష నారాయణ స్వామి శ్రీవల్లిదేవసేన సమేత ద్వికందర షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కొలువైన శ్రీ రామాపురం మహా పుణ్యక్షేత్రంలో గురువారం నాడు ఉత్తర ద్వారం నుంచి దేవదేవులు దర్శనం ఇవ్వనున్నారు .ఈ ప్రపంచంలోనే అత్యంత పురాతన విగ్రహ మూర్తులైన శ్రీ మోక్ష నారాయణ స్వామి శ్రీ వల్లి దేవసేన సమేత ద్వికందర షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవతా మూర్తుల కు ప్రతిరోజు నిత్య కల్యాణాలు జరిగే ఈ ఆలయంలో ప్రతినెల శుక్లపక్ష ఏకాదశి రోజున ఉత్తర ద్వారం తెరుస్తుంటారు అన్ని ఆలయాలలో సంవత్స రానికి ఒకసారి మాత్రమే ఉత్తర ద్వారం తెరుస్తారు కానీ ఈ ఆలయంలో సంవత్సరానికి 12 సార్లు ఉత్తర ద్వారం తెరవడం ఒక విశిష్ట ప్రత్యేకత శ్రీ మహావిష్ణువు మోక్ష అవతారంలో ఈ భువిలో ఎక్కడా లేనివిధంగా మోక్షమార్గం చూపుతూ వెలిసి ఉండడం ఈ ఆలయంలోని మూలవిరాట్ లోని ప్రత్యేకత .గత 15 సంవత్సరాలుగా ఆలయ పునః ప్రతిష్ట అనంతరం ప్రతినిత్యం హరిహర దేవత మూర్తులైన మహాలక్ష్మి మోక్ష నారాయణ స్వామికి శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి కీ ఒకే వేదికపై నిత్య కళ్యాణం జరగడం ఈ ఆలయంలో మాత్రమే జరుగుతుంది. ఉత్తర ద్వారం పైన మహాలక్ష్మి మోక్ష నారాయణ స్వామి కొలువై ఉండి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు అనుగ్రహాన్ని ఇస్తుంటారు సాయంత్రం 5:30కు మాడవీధులలో గరుడోత్సవం అనంతరం మహా మంగళహారతి తీర్థ ప్రసాదములు నిర్వహిస్తారు ఆలయానికి విచ్చేసే భక్తులకు ఆలయ ప్రధాన సేవకులు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ ఆధ్వర్యంలో ఆహార ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అన్నపు రాజు జగదీష్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మాఘమాస శుక్లపక్ష భీష్మ ఏకాదశి సందర్భంగా ఈ ఆలయంలో ఉత్తర ద్వార ప్రవేశం చేసి దేవతామూర్తులను దర్శించుకున్న భక్తాదలకు సకల శుభాలు జరుగుతాయని వేద పండితులు వివరిస్తున్నారు.



# రహదారి భద్రతా నియమాలు పాటించండి

- సీఐ జగదీష్
- పోస్టర్లు అతికించిన నాల్గవ పట్టణ పోలీసులు



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం:** రోడ్డు సేఫ్టీ మిషన్ కార్యక్రమంలో భాగంగా అనంతపురం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం నాడు రోడ్డు భద్రతపై ప్రజలకు విస్తృతంగా అవగా హన చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆటోల ద్వారా రోడ్డు భద్రతా సందేశాలను ప్రచారం చేయడంతో పాటు, ప్రజలు అధికంగా చేరే ముఖ్య కూడళ్లలో రోడ్డు భద్రతకు సంబంధించిన పోస్టర్లను అతికించారు. ఈసందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ... వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి, సీట్ బెల్ట్ వినియోగించాలి, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. ప్రజలంతా రోడ్డు భద్రతా నిబంధనలను పాటించి, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# క్రీడలతో పోలీస్ సిబ్బందికి మానసిక ఉల్లాసం

-14వ బెటాలియన్ కమాండెంట్ ప్రభు కుమార్

- పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం...!





**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం:** పోలీస్ సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికితీయడానికి 'పోలీస్ స్పోర్ట్స్ మీట్' ఎంతో దోహదపడుతుందని అనంతపురం 14వ బెటాలియన్ కమాండెంట్ ప్రభు కుమార్ అన్నారు. జంతులూరు గ్రామంలోని బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. తొలుత క్రీడాకారుల నుంచి గౌరవవందనాన్ని అయన స్వీకరించారు. క్రీడలు ప్రారంభం సందర్భంగా మాట్లాడుతూ 24 గంటలు విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వారిలో ఉన్న క్రీడాప్రతిభకు గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కేశవ రెడ్డి, డి.ఎస్.పి వెంకట శివారెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషా, యూనిట్ డాక్టర్ ఆదిశేషు, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ రమణ, సిబ్బంది ఆఫీసర్స్, అసోసియేషన్ ప్రెసిడెంట్ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# నామ్ కింద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ మంజూరు



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** బ్రహ్మంగారి మఠం మండలం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బుధవారం నూతనంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ ఆయుష్ మిషన్ క్రింద 30 లక్షల వ్యయంతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ బిల్డింగ్ మంజూరు అయ్యింది ఆ భవనానికి భూమి పూజ నిర్వహించడం జరిగింది. ఆయుర్వేద డాక్టర్ పల్లా మహేష్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా టిడిపి మండల ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్ హాజరై కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ మల్లేష్, ఏపీ.ఎం.ఎస్ ఐడిసిఎఈ బాలరాజు వర్క్ ఇన్స్పెక్టర్ బాల నరసింహులు పీహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

# అనిల్‌కు అదృష్టం తలుపుతట్టింది!

**- గ్రూప్-2 విజేతగా జెడ్పీ జూనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్**

**- పట్టు వదలని విక్రమార్కుడిలా మూడో ప్రయత్నంలో ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపిక**

**- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ వద్ద సీసీగా పని చేస్తున్న అనిల్**



**అనంతపురం- సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా పరిషత్‌లో సాధారణ ఉద్యోగిగా ఉంటూ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ వద్ద క్యాంప్ క్లర్క్ (సీసీ)గా పని చేస్తున్న ఎం.అనిల్ కుమార్‌కు అదృష్టం తలుపు తట్టింది. ఆయన గ్రూప్-2 విజేతగా నిలిచారు. మంగళవారం అర్ధరాత్రి విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో అనిల్ కుమార్ ఎక్సైజ్ ఎస్ఐగా విజయం సాధించారు.

**కుటుంబ నేపథ్యం**

కణేకల్లు మండలం బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన నాగభూషణం, జయలక్ష్మమ్మ దంపతుల కుమారుడు అనిల్ కుమార్. ఆరు నుంచి పదో తరగతి వరకు నల్లమాడలో చదువుకున్నారు. తండ్రి ముదిగుబ్బ జెడ్పీహెచ్ఎస్ లో తెలుగు పండిట్ గా పని చేస్తూ 2005లో అకాల మరణం చెందారు. 2007 డిసెంబర్‌లో కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగంలో చేరిన అనిల్ కుమార్ రామగిరి, రొద్దం ఎంపీడీఓ కార్యాలయాల్లో పని చేశారు. ఆ తరువాత పీఆర్ అనంతపురం, ధర్మవరం సబ్ డివిజన్లలో పని చేశారు. 18 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు. ఆయనకు భార్య ఉషా పద్మజ (గృహిణి), బీటెక్ ఫస్టియర్ చదివే కీర్తిప్రియ, తొమ్మిదో తరగతి చదివే హాసిని పిల్లలు.

**గ్రూప్-2 సాదించాలన్న పట్టుదలతో..**

అనిల్ కుమార్ జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నా.. చేసే ఉద్యోగంతో ఆయన సంతృప్తి చెందలేదు. గ్రూప్-1 సాధించాలని పట్టుదలతో ఉన్న ఆయన కనీసం గ్రూప్-2 అయినా సాధించి తీరాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉద్యోగానికి సెలవు పెట్టేసి రోజుకు 18 గంటల పాటు చదివారు. చివరకు విజేతగా నిలిచి ఎంతో మంది యువతకు ఆదర్శంగా నిలిచారు.

**శభాష్.. అనిల్ కుమార్ జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ ప్రశంసలు**

విధి నిర్వహణలో నీతి, నిజాయతీ, నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన సాధారణ ఉద్యోగి అయిన అనిల్ కుమార్ గ్రూప్-2కు సిద్ధమవుతున్నట్లు తెలపగానే సంతోషించా. పోస్ట్ కొట్టి తిరిగి రావాలని చెప్పా. ఇచ్చిన మాట ప్రకారం.. గ్రూప్-2 విజేతగా నిలచి, ఎక్సైజ్ ఎస్ఐగా విజయం సాధించడం గర్వంగా ఉంది. భవిష్యత్ లో ఆయన మరింత ఉన్నత పదవులు అధిష్ఠించాలని కోరుకుంటున్నట్లు జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జెడ్పీ ఉద్యోగులు కూడా అనిల్ కుమార్ ను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

# టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ. 5 లక్షల భీమా చెల్లింపు

**- కార్యకర్తలను అందుకునే ఏకైక పార్టీ టిడిపి**

**- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్**

**శాంతిపురం - సూర్య వాస్తవం:** ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన మండల పరిధిలోని చౌడంపల్లి పంచాయితీ నల్లరాళ్లపల్లి గ్రామ టీడీపీ కార్యకర్త మంజునాథ్ కుటుంబానికి పార్టీ అండగా నిలిచింది. పార్టీ సభ్యత్వ భీమా ద్వారా మంజూరైన రూ.5 లక్షల చెక్కును బుధవారం వారి ఖాతాలో జమ చేసినట్లు ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. బుధవారం స్థానిక టిడిపి నేతలుతో కలిసి మంజునాథ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేస్తూ పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయో తెలియదు, కానీ జరిగిన తర్వాత ఆ కుటుంబాన్ని రోడ్డున పడనీయకుండా చూసుకోవడమే నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని అన్నారు. యువ నాయకుడు, నారా లోకేష్ కార్యకర్తలను ప్రాణప్రదంగా చూసుకుంటారని అందులో భాగంగానే ఏదైనా సంఘటనల్లో ప్రమాదవశాత్తు చనిపోయిన కార్యకర్తలకు ఐదు లక్షల రూపాయల భీమాను పార్టీ తరఫున అందించే విధంగా నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. అందుకే టిడిపి కార్యకర్తగా ఉండి ప్రమాదం బారిన పడిన ప్రతి ఒక్కరిని పార్టీ ఆదుకుంటుందని తెలిపారు. మంజునాథ్ భార్య లతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించే ప్రయత్నం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నందిగం ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మంజునాథ్ గౌడ్, గుంజార్లపల్లి సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.





# స్త్రీ శక్తి పథకానికి విశేష ఆదరణ

- 18 నెలలుగా ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- స్త్రీ శక్తి పథకం మహిళలకు సంపూర్ణ సంతృప్తిని ఇస్తోంది
- స్త్రీ శక్తి పథకాన్ని పూర్తి బాధ్యతతో, పారదర్శకంగా అమలు చేస్తున్నాం
- గత ఐదేళ్లుగా పరిష్కారం కాని ఆర్టీసీ సమస్యలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోంది
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్త డిపిటిఓ లతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి, పాల్గొన్న ఎండీ ద్వారక తిరుమల రావు, ఈడీలు, డిపిటిఓలు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 15 ఆగస్టు 2025న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం రాష్ట్ర మహిళల జీవితాల్లో చారిత్రాత్మక మార్పుకు నాంది పలికిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకాన్ని విశేషంగా ఆదరణ లభిస్తుందని, 18 నెలలుగా ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తు.. స్త్రీ శక్తి పథకం మహిళలకు సంపూర్ణ సంతృప్తిని ఇస్తోందనీ, స్త్రీ శక్తి పథకాన్ని పూర్తి బాధ్యతతో, పారదర్శకంగా అమలు చేస్తున్నామని, గత ఐదేళ్లుగా పరిష్కారం కాని ఆర్టీసీ సమస్యలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు,



ట్రాన్స్‌జెండర్స్‌కు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. ఇప్పట వరకు 40 కోట్ల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఆర్టీసీకి రూ.1,388 కోట్ల సబ్సిడీ అందించిందన్నారు. పథకం అమలుతో బస్సుల్లో మహిళా ప్రయాణికుల శాతం 40 శాతం నుంచి 63.4 శాతానికి, రోజువారీ మహిళా ప్రయాణికుల సంఖ్య 16.11 లక్షల నుంచి 24.14 లక్షలకు పెరిగిందని తెలిపారు. పెరిగిన డిమాండ్?కు అనుగుణంగా 1,413 అదనపు ట్రిప్పులు, 64,647 అదనపు కిలోమీటర్లు ఆపరేట్ చేస్తున్నామని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యార్థం 63 బస్ స్టేషన్లలో ఆర్.ఓ. వాటర్ ప్లాంట్లు, మరుగుదొడ్ల పునరుద్ధరణకు 152 బస్ స్టేషన్లకు రూ.24 కోట్లు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశం అనంతరం ఉత్తమ సేవలు అందించిన అది కారులకు మంత్రి ప్రశంస పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా విజయవాడలో ఏపీఎస్ఆర్టీసీ నూతన కార్గో కౌంటర్‌ను మంత్రి ప్రారంభించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక భారం తగ్గడంతో పాటు వారి స్వావ లంబన, భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# విద్యుత్ శాఖ ఓ అండ్ ఎం డైరీని ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

**- జేఎల్‌ఎం గ్రేడు -2 సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి**



**కడప - సూర్య వాస్తవం :** జనవరి విద్యుత్ శాఖ ఎంప్లాయిస్ అసోసియేషన ఓ అండ్ ఏం డైరీని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం విజయ వాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఓ అండ్ ఎం ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఓ అండ్ ఎం విద్యుత్ శాఖ ఉద్యోగులు మంత్రికి జేఎల్‌ఎం గ్రేడ్2 సమ స్యలపై వినతి పత్రం అందజేశారు. 2019 సంవత్సరంలో నియమితులైన జూనియర్ లైన్మెన్లు అత్యంత ప్రమాదకర పరిస్థితులలో నిజాయితీగా సేవలు అందిస్తు తమ ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. అయితే కోర్టు కేసుల కారణంగా వీరిని ఇప్పటివరకు విద్యుత్ శాఖలో విలీనం చేయకపోవడం వలన తీవ్రమైన మానసిక ఒత్తిడికి, ఆందోళనకు గురవడం జరుగుతుందని మంత్రికి తెలిపారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా మాతోపాటు నియమించబడిన ఇతర శాఖల వారికి వారి వారి మాతృ శాఖల యందు పాత సర్వీసుల రూల్స్ ప్రకారం ప్రమోషన్లు 2024లో ఇవ్వడం జరిగిందని ఉదా హరణకు వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పశు సంవ ర్ధక శాఖలలో పర్మినెంట్ చేయడం జరిగిందన్నారు. విద్యుత్ శాఖలో జేఎల్‌ఎం గ్రేడ్ 2 వారికి కూడా ఎవరైతే ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు జేఎల్‌ఎం గా కన్వర్షన్ ఇవ్వమని డిపార్ట్మెంట్ వారు జీవో ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో జేఎల్‌ఎంలకు కొత్తగా బేసిక్ రూ 31,500 ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. సబ్ స్టేషన్లలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ షిఫ్ట్ ఆపరేటర్లు కోర్టులో పిటిషన్ వేసి స్టే ఇవ్వడంతో వారిని ఎటువంటి రిక్రూట్మెంట్ లేకుండా డైరెక్టుగా రికమండేషన్ ద్వారా డిపార్ట్మెంట్లో చేరడం జరిగిందన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పర్మినెంట్ ఉద్యోగులకు సమానం కాదు అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని కోర్టు తీర్పులకు సంబంధం లేకుండా జేఎల్‌ఎం గ్రేడ్ 2 లను అసెంబ్లీలో చట్ట సవరణ చేసి జేఎల్‌ఎం గ్రేడ్ 2 లను సంస్థలో విలీనం చేయవలసిందిగావారు మంత్రి కోరినట్లు తెలిపారు. విద్యుత్ శాఖలో ఓ అండ్ యం విభాగము విద్యుత్ శాఖకు వెన్నెముక లాంటిదని రెగ్యులర్ ఉద్యోగులు 365 రోజులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతర విద్యుత్ సరఫర అందించేందుకు తమ వంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. అలాంటివారికి సరైనటువంటి గౌరవం దక్కడం లేదని వారానికి ఒక రోజైనా సెలవు ప్రకటించాలని అదేవిధంగా వారికి ప్రత్యేక పిఆర్సి మంజూరు చేసి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఈ సందర్భంగా వారు మంత్రికి వినతి పత్రం ద్వారా తెలియజేయడం జరిగిందని ఓ అండ్ ఎం విద్యుత్ ఎంప్లాయిస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓ అండ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు పాల రాజు, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దవనం దొరబాబు, జనరల్ సెక్రెటరీ రమేష్, వైస్ ప్రెసిడెంట్ ఎస్ రాజు, ట్రెజరర్ వై రాజు, జాయింట్ సెక్రెటరీ జి శ్రీనుబాబు, ఈసీ మెంబర్ జయరాజు, గిరి తదితరులు పాల్గొన్నారు.

# అనంత ఆస్పత్రిలో ఆడ శిశువు అదృశ్యం?

- ప్రసూతి వార్డులో సిస్టర్లు, సెక్యూరిటీ నిర్లక్ష్యం
- శిశువును ఎత్తుకెళ్లింది నాన్నమ్మేనా?
- అలస్యంగా వెలుగులోకి ఘటన
- రంగంలోకి రెండో పట్టణ పోలీసులు




**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం:** అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కలకలం చెలరేగింది. ఆడ శిశు వు మాయం కావడం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. బుధవారం మధ్యాహ్నం ఘటన జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి రావడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. అనంతపురం రూరల్ కక్కలపల్లికి చెందిన ఓ నిండు గర్భిణి పురిటినొప్పులతో ఆస్పత్రిలో అడ్మిట్ అయింది. ఆమె ఈ నెల 24న ఆడ శిశు వుకు జన్మనిచ్చింది. అప్పటికే ఇద్దరు ఆడ పిల్లలు, ఒక మగ పిల్లాడు ఉన్నారు. నాల్గో కాన్పులో ఆమె మళ్లీ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలో ఉదయమే ఆడ శిశువకు అమ్మమ్మ వ్యాక్సిన్ వేయించుకొచ్చినట్లు చెబుతున్నారు. మధ్యాహ్నం నాన్నమ్మ వచ్చి.. శిశువుకు స్నానం చేయించు కువస్తానని చెప్పి ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఆ తరువాత ఆమె శిశువును తెచ్చివ్వక పోవడంతో బాలింత, ఆమె తల్లిదండ్రులు ఏడుస్తుండడం గమనించారు. అంతలోనే ఆడ శిశువు లేకపోవడం, నాన్నమ్మ కూడా కనిపించక పోవడంతో ఆమెపైనే అందరికీ అనుమానం బలపడింది. ఆస్పత్రి అధికారులకు సమాచారం అందిన వెంటనే అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్‌కు సమాచారం అందించారు. ఆయన ఆగమేఘాల మీద రంగంలోకి దిగి దర్యాప్తు ముమ్మరం చేశారు.

# కాఫీ పరిశ్రమలో ఘోర ప్రమాదం

- రాత్రి షిఫ్ట్‌లో మిషన్‌లో ఇరుక్కొని యువ కార్మికుడి చేయి చిద్రం
- విషయం బయటకు రాకుండా యాజమాన్య ప్రయత్నం...
- పోలీసులను ఆశ్రయించిన బాధిత కుటుంబం





**సూళ్లూరుపేట-సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం కువ్వకొల్లి గ్రామ సమీపంలో ఉన్న కాంటినెంటల్ కాఫీ పార్క్ పరిశ్రమలో ఆదివారం రాత్రి షిఫ్ట్‌లో ఘోర పరిశ్రమ ప్రమాదం చోటుచేసుకుంది. ఆలస్యం గా వెలుగులో కి వచ్చింది, విధులు నిర్వహిస్తున్న ఓ యువ కార్మికుడి ఎడమ చేయి భారీ మిషన్‌లో ఇరుక్కొని ముందు భాగం పూర్తిగా ఎముకలు విరిగి, కాలిపోవడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. పని చేసే ప్రాంతంలో తగిన భద్రతా ప్రమాణాలు లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని తోటి కార్మికులు ఆరోపిస్తున్నారు. ఒక్కసారిగా జరిగిన ప్రమాదంతో యువకుడు తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలగా, సహచరులు వెంటనే సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

**బయటకు రాకుండా యాజమాన్య ప్రయత్నం**

ఈ ఘటన ఆదివారం రాత్రి షిఫ్ట్‌లో జరగడంతో, విషయం బయటకు పొక్కకుండా కంపెనీ యాజమాన్యం ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాన్ని అధికారులకు తెలియజేయకుండా, కార్మికులపై మౌనం పాటించాలంటూ ఒత్తిడి తెచ్చినట్లు కూడా సమాచారం.

**"మాకు సంబంధం లేదు" -- బాధ్యత నుంచి తప్పుకుంటున్న కంపెనీ యాజమాన్యం**

ప్రమాదం జరిగిన మరుసటి రోజే కంపెనీ యాజమాన్యం "ఇక మాకు సంబంధం లేదు... మీ సొంత ఖర్చులతో చికిత్స చేయించుకోండి లేదా ఈఎస్ఐ ఆస్పత్రికి వెళ్లండి" అంటూ బాధితుడి వైద్య బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

**ఆటో తోలే తండ్రి... కుమారుడి చికిత్స భారంగా**

బాధిత యువకుడి తండ్రి రోజువారీ ఆటో తోలుకొని జీవనం సాగిస్తున్న నిరుపేద కార్మికుడు కావడంతో, ఖరీదైన వైద్య చికిత్సను భరించే స్థోమత కుటుంబానికి లేదని తెలుస్తోంది."ఫ్యాక్టరీలో పని చేసి మా బిడ్డ ఈ స్థితికి చేరుకున్నాడు. కంపెనీ పూర్తి బాధ్యత తీసుకుని మంచి చికిత్స ఇవ్వాలి" అని తల్లిదండ్రులు కన్నీటితో వేడుకుంటున్నారు.

**సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

ఈ ఘటనపై న్యాయం కోసం బాధిత కుటుంబ సభ్యులు సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్?ను ఆశ్రయించి అధికారికంగా ఫిర్యాదు (అర్జీ) చేశారు. కంపెనీ నిర్లక్ష్యం, భద్రతా లోపాలపై విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని వారు పోలీసులను కోరారు.

**భద్రతా ప్రమాణాలపై పెద్ద ప్రశ్న**

ఈ ఘటనతో కాంటినెంటల్ కాఫీ పార్క్‌లో కార్మికుల భద్రతకు తగిన చర్యలు ఉన్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాత్రి షిఫ్ట్‌లలో కార్మికుల ప్రాణాలపై యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

ఈ ఘటనపై లేబర్ డిపార్ట్‌మెంట్, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, జిల్లా అధికారులు తక్షణమే స్పందించి

- బాధితుడికి పూర్తి వైద్య ఖర్చులు కంపెనీ భరించాలి
- ప్రమాదానికి కారణమైన నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరపాలి
- యాజమాన్యంపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి
- భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా భద్రతా నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేయాలి

అని తల్లితండ్రులు, ప్రజలు, కార్మిక సంఘాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి.

# గ్రామస్థాయి నుండి మాదిగలు అభివృద్ధి చెందే దిశగా పని చేద్దాం




**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మాదిగలు అభివృద్ధి చెందే దిశగా అందరం కలిసి పని చేద్దామని ఎండిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లిలో మాదిగల కమిటీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు దొడ్డి సురేష్ ఆధ్వర్యంలో మండల కమిటీ ఏర్పాటు చేసి కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో మాదిగ జాతికి ఎలాంటి సమస్యలు వచ్చిన ఎండిపిఎస్ నాయకత్వం ముందు ఉంటుందని ఆయన అన్నారు. ముందుగా మాదిగలు గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఎదగడానికి ప్రయత్నం చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ఆధిపత్య కులాలతో సమానంగా విద్య ఉద్యోగం ఆర్థిక సామాజిక రంగాలలో రాజ్యాధికారంలోకి మాదిగలు ఎదగాలని ఆయన సూచించారు.దీనికి మాదిగలు అందరూ కలిసికట్టుగా ఉండాలని ఆయన సూచించారు. సమాజంలో రాజకీయ నాయకుల దగ్గర అగ్రకులస్తుల బానిసత్వాన్ని వారు వదిలి భవిష్యత్ తరాల కోసం మనం కష్టపడాలని ఆయన సూచించారు. కొంతమంది మాదిగ నాయకులు గల్లీకొక మాదిగ సంఘం పెట్టుకొని మాదిగ జాతిని బానిసత్వంగా ఇప్పటికే కొనసాగుతున్నారని ఆయన అన్నారు. రాబోయే పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మాదిగలు ఐక్యతతో పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిపీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సివి రమణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెన్నకేశవులు రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య రాయలసీమ ఇన్చార్జి విజయ్ కుమార్ చిత్తూరు ఉమ్మడి జిల్లాల ఇన్చార్జి పురుషోత్తం అన్నమయ్య జిల్లా గౌరవ అధ్యక్షులు నాగేశ్వరరావు జిల్లా ఇన్చార్జి నాగార్జున జిల్లా కార్యదర్శి కృష్ణయ్య ఎంపీటీసీ రామరాజు రాయచోటి ఇన్చార్జి సురేష్ పుంగనూరు ఉపాధ్యక్షులు హరిబాబు సంబేపల్లి మండల అధ్యక్షులు బాబు ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం గౌరవ అధ్యక్షులు మనీ తిరుమల రావు రామాపురం మండల అధ్యక్షుడు ధోని గౌరవాధ్యక్షులు రమణయ్య లకిరెడ్డిపల్లి మండల అధ్యక్షుడు బాబు కెవిపల్లి మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఉపాధ్యక్షులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సేవకు సత్కారం...!

## - ఐఎమ్ఎమ్ మహబూబ్ బాషాకు ప్రజా సంఘాల నాయకులు ఘనసత్కారం



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం ప్రజాసేవ,అనాధ శవాలకు అంత్యక్రియలు చేసినందుకు రిపబ్లిక్ డే రోజున అనంతపురం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ విష్ణు చరణ్,జిల్లా ఎస్పీ పి జగదీష్ చేతుల మీదుగా ఐఎంఎం మహబూబ్ బాషా ప్రశంస పత్రం అందుకున్నందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా సంఘం నాయకులు కలిసి ఘనంగా ఐఎంఎం మహబూబ్ బాషా ను సత్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ మా సేవలు గుర్తించి మా బృందానికి గతంలో పార్టీలకతీతంగా డిప్యూటీ సీఎం అంజద్ భాషా,సిపిఐ కార్యదర్శి రామకృష్ణ, జాఫర్, రోటరీ క్లబ్, జెసి పవన్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా,వివిధ పార్టీ వారు మసీదు పెద్దలు ప్రజా సంఘ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. వారందరికీ మెహబూబ్ భాష ప్రత్యేకంగా గుర్తు చేసుకుంటూ ధన్యవాదాలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

## - డీఎస్పీ వి. శ్రీనివాసరావు

## - నలంద జూనియర్ కళాశాలలో అవగాహన

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** రోడ్డు సేఫ్టీ మిషన్‌లో భాగంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం డీఎస్పీ వి. శ్రీనివాసరావు, త్రీ టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ట్రాఫిక్ సి.ఐ వెంకటేష్ నాయక్ ల ఆధ్వర్యంలో స్థానిక నలంద జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతపై బుధవారం నాడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించడం ఎంతో అవసరమని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగంతో డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. అలాగే విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను తెలుసుకొని తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# రూ.22.87లక్షల సీఎం ఆర్.ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే కాలవ



**రాయదుర్గం - సూర్య వాస్తవం:** ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అత్యవసర సమయాల్లో ప్రైవేటు ఆసుపత్రిల్లో ఖరీదైన వైద్యం చేయించుకున్న వారి పట్ల ప్రత్యేకమైన ప్రేమ, బాధ్యతతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో బుధవారం 45 మందికి రూ.22.87 లక్షల విలువైన చెక్కులు ఆయన అందచేశారు. చాలా మంది పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు సంబంధించిన వాళ్లకే ఈ సహాయం అందుతొందన్నారు. ఇప్పటిదాకా రాయదుర్గంలో 255 మందికి రూ.కోటీ తొంబై లక్షల ఆర్థిక సహకారం అందజేసి ఆయా కుటుంబాలను ఆదుకోవడం జరిగిందన్నారు. ఇంత పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి సహాయనిధి నుండి డబ్బులు ఇస్తున్నది చంద్రబాబు నాయుడేనని, పేదలు బడుగు బలహీన వర్గాలు జీవితకాలం ఆయనకు రుణపడి ఉండాలన్నారు. సమయానికి చాలా మంది బంధువులు, మిత్రుల దగ్గర అప్పులు చేసి, ప్రైవేట్ గా వడ్డీలకు తీసుకువచ్చి చికిత్స చేయించుకోవడం చేస్తున్నారన్నారు. అట్లాంటి వాళ్ళందరికీ పెద్ద ఊరటనిస్తున్న ఈ ఆర్థిక సహాయం తన చేతుల మీదుగా అందిస్తుండటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆశీస్సులతో మరింత ఎక్కువ మందికి ఇలాంటి సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మండల కన్వీనర్లు వన్నారెడ్డి, కురుబ హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షుడు లాలేప్ప కార్పొరేషన్ డైరెక్టరులు ఉప్పర ఆనంద్, పురుషోత్తం, నాగల్లీ రాజు,వీరేశ్,ధనుంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించిన వాహన చోదకులకు కౌన్సెలింగ్

## - రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన చేసిన ట్రైనీ అధికారి అశ్వినీ మణిదీప్, అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** రోడ్డు సేఫ్టీ మిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోలీసుల తనిఖీలలో పట్టుబడిన ఉల్లంఘనదారులకు, వాహనాలు నడుపుతున్న మైనర్లకు ట్రైనీ ఐ.పి.ఎస్ అధికారి అశ్వినీ మణిదీప్, అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావులు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన చేశారు. స్థానిక ఇండియన్ డ్రైవింగ్ స్కూలులో బుధవారం నాడు జరిగిన ఈకార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ అధికారితో పాటు ట్రాఫిక్ సీఐలు వెంకటేష్ నాయక్, శ్రీకాంత్ , రాజేంద్రనాథ్ యాదవ్‌లు, ఎస్సై రాంభూపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ అధికారి అశ్విని మణిదీప్, డీఎస్పీ వి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ... చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. హెల్మెట్, సీట్?బెల్ట్ వాడకాన్ని నిర్లక్ష్యం చేయడం, అధిక వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి అలవాట్లు కేవలం చట్ట ఉల్లంఘనలే కాకుండా కుటుంబాల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే చర్యలని వివరించారు. ప్రతి వాహన చోదకుడు తనతో పాటు రోడ్డుపై ఉన్న ఇతరుల ప్రాణ భద్రతకు కూడా బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రోడ్డు నిబంధనలు శిక్షల కోసం కాకుండా ప్రాణాలను కాపాడేందుకే రూపొందించబడ్డాయని, వాటిని కచ్చితంగా పాటించినప్పుడే ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకొని క్రమశిక్షణతో వాహనాలు నడపాలని హితవు పలికారు.

# ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

## - సిఐటియు



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం:** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం హోసూరు సమీపంలో ఉన్న వేర్ హౌస్ గోడౌన్ హమాలీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వేర్ హౌస్ హమాలి వర్కర్స్ యూనియన్ మేస్త్రి రామాంజనేయులు అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర, మాట్లాడుతూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికులు కర్షకులు సంఘటిత అసంఘటిత కార్మికులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెలో ముఖ్యమైన సమ్మె డిమాండ్లను ఆయన ఈ సందర్భంగా తెలుపుతూ నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి. అంగన్వాడీ ఆశా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. రవాణా రంగం మరియు హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. అసంఘటిత రంగం కార్మికులకు జీవిత భద్రత కల్పించాలి. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం రంగ సంస్థల ప్రైవేటు కరణ పెట్టుబడుల ఉపసంహరణను ఆపాలి. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలి. సొంత ఘనులు కేటాయించాలి. ఆదాని కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ కార్యకలాపాలు పునరుద్ధరించాలి. కనీస వేతనం 26,000 ఇవ్వాలి. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని దేశవ్యాప్తంగా ఈ డిమాండ్స్ తో 12న పెద్ద ఎత్తున సమ్మె జరుగుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేర్ హౌస్ గోడౌన్ హమాలీలు సుంకన్న, నాగేంద్ర, వంశీ, టి. సహదేవుడు, ఎం. రాజు, హుసేని, మధు, మద్దిలేటి, వై. రమేష్, ఏ. అమాన్, తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటిలో రిజిస్ట్రేషన్ ఛార్జీలు తగ్గించాలి

- ప్రజల సమస్యలపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వినతి
- ప్రజలపై భారం తగ్గించాలంటూ రెవెన్యూ శాఖకు విజ్ఞప్తి
- ఈ అంశంపై సానుకూలంగా స్పందించి, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచబోమని రెవెన్యూ మంత్రి హామీ



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రాంత ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో మంత్రి సత్య ప్రసాద్ కలిసి మాట్లాడిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, గతంలో అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి ఉన్న సమయంలో రిజిస్ట్రేషన్ విలువలను 200 నుంచి 300 శాతం వరకు పెంచడం జరిగిందని, జిల్లా కేంద్రం మారినప్పటికీ అదే విలువలు కొనసాగడం వల్ల రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. వాస్తవ భూమి విలువలకు మించి మార్కెట్ విలువలు నిర్ణయించడంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు. అలాగే 01-02-2026 నుంచి భూముల మార్కెట్ విలువను మరింత పెంచే ప్రతిపాదన అమలులోకి వస్తే పరిస్థితి మరింత దిగజారుతుందని, దీని ప్రభావం ప్రజల ఆర్థిక స్థితిపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, రాయచోటి ఎస్‌ఆర్‌ఓ పరిధిలో రిజిస్ట్రేషన్ ఛార్జీలను తగ్గించడంతో పాటు, 01-02-2026 నుంచి ప్రతిపాదిత మార్కెట్ విలువ పెంపును నిలిపివేయాలని ప్రజల, రియల్ ఎస్టేట్ రంగ ప్రయోజనాల దృష్ట్యా పరిశీలించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సానుకూలంగా స్పందించి, ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## టీచర్లకు ఇచ్చిన మేనిఫెస్టో

# హామీలను నెరవేర్చక పోవడం అన్యాయం

- కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్టీయూ నాయకులు
- అన్నమయ్య జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు శివారెడ్డి



**రాయచోటి - సూర్య వాస్తవం:** ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధ్యాయులకు ఇచ్చిన మేనిఫెస్టో హామీలను నిర్లక్ష్యం చేయడం, వేతన సవరణ కమిషన్ను ఏర్పాటు చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి మండి పడ్డారు. బుధవారం రాయచోటి పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ నందు సీనియర్ నాయకులు రవీంద్రనాథ్ రెడ్డి డివిజనల్ కన్వీనర్ మురళి కుమార్, మైనార్టీ కన్వీనర్లు భాష, అంజద్ భాష లతో కలిసి ఉపాధ్యాయులకు ఇచ్చిన మేనిఫెస్టో హామీలను నిర్లక్ష్యం పై ముద్రించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌టియు నాయకులు రాష్ట్ర నాయకత్వం నిరసనగళంతో దశల వారిగా ఉద్యమానికి పిలుపునిస్తూ రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాలను విడుదల చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైన విధానం కాదని అన్నారు. ఈ సందర్భంగా ఎస్‌టియు సీనియర్లు, డివిజనల్ నాయకులు, మాట్లాడుతూ... ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడం సరైన విధానం కాదని, ప్రభుత్వం ఏర్పడి దాదాపు 20 మాసాలు గడుస్తున్నపాత ప్రభుత్వంలోనే వ్యవహరించడం సరికాదని పిఆర్సి కమిటీని వెంటనే ప్రకటించి 30శాతం ప్రకటించడంతోపాటు పెన్షనర్స్‌కి సర్వే ఉపాధ్యాయులకి ఉద్యోగస్తులకు రావాల్సిన అన్ని బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఎస్టియు నాయకత్వం కలసొచ్చే సంఘాలను కలుపుకొని ప్రభుత్వ అలసత్వంపై ముందుకు పోతుందని ఆయన వారున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## సత్యసాయి జిల్లా కలెక్టర్‌ను

# కలిసిన జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు

- నూతన కమిటీ సభ్యులను అభినందించిన కలెక్టర్ శ్యాంప్రసాద్



**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం:** సత్యసాయి జిల్లా జర్నలిస్టుల నూతన అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు బుధవారం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న కలెక్టర్ శ్యాంప్రసాద్ ను సత్యసాయి జిల్లా నూతన అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు ఎద్దుల సంతోష్ రెడ్డి, శివరామకృష్ణ, పుల్లయ్య, శంకరప్ప, సాయికుమార్ ,గోవర్ధన్ రెడ్డి,గోగుల చక్రపాణి, శ్రీనివాసులు, కొప్పెర్ల వెంకట సుబ్బయ్య,శివ కుమార్,వి.శివకుమార్,,శివప్ప ,తోపాటు పాత్రికేయులు తదితరులు ప్రత్యేకంగా కలసి పుష్ప గుచ్చం పాటు పూల మొక్కలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లాకు కొత్తగా నియామకమైన అక్రిడిటేషన్ కమిటీని కలెక్టర్ శ్యాం ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తగా ఎన్నికైన అక్రిడిటేషన్ కమిటీ జిల్లా పాత్రికేయుల అభ్యున్నతికి పారదర్శకంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జనవరి 31 నాటికి అక్రిడిటేషన్ గడువు పూర్తవుతుందని ఈ మూడు రోజుల్లో అందుకు సంబంధించిన అధికారులు, అక్రిడీటెషన్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి అతి త్వరలో అర్హులైన పాత్రికేయులందరికీ కొత్త అక్రెడిటేషన్ మంజూరుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ నూతన కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు.



## శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో

# 37వ జాతీయ భద్రతా మాసోత్సవాలు




**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్-ఎస్ విభాగపు ఆధ్వర్యంలో బుధవారం 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల భాగంగా రహదారి భద్రత ప్రచారం అంశంపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయచోటి పరిధి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జె. అనిల్ కుమార్ విశిష్ట అతిథిగా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం.అజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం విలువైనదని కావున ద్విచక్ర వాహనం పై పరిమిత సంఖ్యలో ప్రయాణిస్తూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ను తప్పనిసరిగా ధరించాలని, ప్రయాణ సమయంలో సెల్ ఫోన్లో సంభాషించకుండా వాహనాలను నడపాలని సూచించారు. మద్యం మరియు డ్రగ్స్ సేవించి వాహనాలను అధిక వేగంతో నడపరాదని, పరిమితికి మించి వాహనాలలో ప్రయాణించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్ మాట్లాడుతూ వాహనాలను ప్రయాణిస్తున్నప్పుడు రహదారి భద్రతా సూచనలను తప్పనిసరిగా పాటించాలని, రోడ్డు ప్రమాదాలకు గురైన వ్యక్తులను సరైన సమయంలో బాధితులను ఆసుపత్రికి చేర్చాలని, దీనివలన సాక్షులకు ఎటువంటి ఇబ్బంది ఉండనట్లుగా చట్టంలో మార్పులు చేశారని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి బాలాజీ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ రూల్స్ ను పాటించి క్షేమంగా గమ్యస్థానాలను చేరాలని అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి వెంకటరమణ మాట్లాడుతూ దేశంలో యువత అధికంగా ద్విచక్ర వాహనాల ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడం , పాక్షిక లేక పూర్తిగా అంగవైకల్యం పొంది తల్లిదండ్రులకు ఆర్థిక,మానసిక ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదని హితవు చెప్పారు. ఈ సందర్భంగా అతిథులను కళా శాల యజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో రాయచోటి పట్టణ ఆర్టీవో ఆఫీస్ సిబ్బంది, కళాశాల విభాగాధిపతులు డాక్టర్ ఇంతియాజ్, డాక్టర్ ఎన్. నాగేంద్ర, డాక్టర్ ఏ.నరేష్, పి.సుభాన్, పి శ్రావణ్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ పృథ్వీ కుమార్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




# నేడు సామూహిక ఎలుకల నిర్మూలన

- 68 రైతు సేవా కేంద్రాల్లో
- ఉచితంగా బ్రోమో డయలిన్ మందు
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- డా.యం. నాగార్జునసాగర్



**నాయుడుపేట -సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలోని నాయుడుపేట, కోట, పెళ్లకూరు, చిట్టమూరు, వాకాడు మండ లాల్లో నేడు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహి ంచను న్నట్లు సహాయ వ్యవసాయ సంచా లకులు డా. ఎం. నాగార్జునసాగర్ తెలి పారు. ఈ కార్యక్రమం డివిజన్ పరిధి లోని మొత్తం 68 రైతు సేవా కేంద్రాలలో ఒకేసారి నిర్వహించ బడుతుందని ఆయన వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో ఎలుకలను నిర్మూలించి తమ పంటలను కాపాడుకోవాలని సూచించారు. బ్రోమో డయలిన్ మందు ఉచితంఈ కార్యక్రమంలో భాగంగా రైతులు తమ గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి, అవసరమైన బియ్యపు నూకలు, నూనె తీసుకొస్తే, ప్రభుత్వం తరఫున 'బ్రోమో డయలిన్' విషపు రసాయనాన్ని ఉచితంగా అందజేసి, అక్కడికక్కడే విషపు ఎరను తయారు చేసి రైతులకు అందజేస్తామని తెలిపారు.

**విషపు ఎర తయారీ విధానం**

- 482 గ్రాములు - బియ్యపు నూకలు
- 8 గ్రాములు - బ్రోమో డయలిన్ మందు
- 10 గ్రాములు - నూనె

ఈ మిశ్రమాన్ని కలిపి చిన్న పొట్లాలుగా తయారు చేసి, ఎలుకలు ఉన్న కన్నాలు (బోరీయలు)లో పెట్టాలి.ఎకరాలకు సరిపడే పరిమాణం500 గ్రాముల విషపు ఎర ఒక హెక్టారుకు (సుమారు 2.5 ఎకరాలు) సరిపోతుందని వ్యవసాయ అధికారులు స్పష్టం చేశారు.

**రైతులకు విజ్ఞప్తి**

ఎలుకల వల్ల కలిగే పంట నష్టాన్ని తగ్గించుకోవడానికి రైతులందరూ ఈ సామూహిక కార్యక్రమంలో పాల్గొని, వ్యవసాయ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని డా. నాగార్జునసాగర్ కోరారు.

# ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

- ఉత్తమ సేవలతోనే వారికి సమాజంలో గుర్తింపు
- డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి వెల్లడి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** సమాజ నిర్మాతలు ఉపాధ్యా యులేనని, విధి నిర్వ హణలో ఉత్తమ సేవలు అందిం చినప్పుడే వారికి సమా జంలో గుర్తింపు లభిస్తుందని డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. సంబేపల్లి మండలం మోటకట్ల జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని బీఎస్ పద్మావతికి జాతీయ ఉత్తమ విద్యావేత్త పురస్కారం దక్కిన సందర్భంగా బుధవారం ఉదయం పాఠశాలలో ఆమెకు అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల వృత్తి ఎంతో పవిత్రమైనదని దానిని సక్రమంగా నిర్వర్తించినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయిని చప్పిడి పద్మజ మాట్లాడుతూ బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో ప్రతిభ కనపరిచిన వారికి ఈ పురస్కారాలను అందజేయడం జరుగుతూ ఉందన్నారు. అందులో భాగంగా ఆంగ్ల ఉపాధ్యాయినిగా శ్రీమతి పద్మావతి అందించిన సేవలతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అహర్నిశలు కృషి చేయడం వల్ల ఈ అవార్డుకు ఎంపిక కావడం జరిగిందన్నారు. అవార్డుతో పాటు రూ.51 వేలను నగదు బహుమతిగా పొందడం గొప్ప విషయమన్నారు. అనంతరం అతిథులతో పాటు పాఠశాల ఉపాధ్యాయుల బృందం దుశ్శాలువులతో, పూలమాలలతో జ్ఞాపికలను ఇచ్చి బిఎస్ పద్మావతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు ఓబుల్ రెడ్డి, నిర్మల, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో యువత పాత్ర విశేషం

- వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమంలో పాల్గొన్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు
- అభినందించిన డైరెక్టర్ కుమారస్వామి గుప్తా



**వేంపల్లె - సూర్య వాస్తవం:** దేశాభివృద్ధిలో యువత పాత్ర విశేషమైందని, అందుకు అనుగుణంగా వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ వేదికపై పాల్గొనడం అభినందనీయం అని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా వెల్లడించారు. బుధవారం ఇటివల జరిగిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థుల పట్ల డైరెక్టర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ వేదికల్లో ట్రిపుల్ ఐటీ నుంచి దాదాపు 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే దేశ అభివృద్ధికి సంబంధించి విభిన్న అంశాలపై తమ అభిప్రాయా లను వ్యక్తపరిచారు. విద్యార్థులు సంకీర్తన రెడ్డి, సత్య మహేంద్ర, దస్తగిరి బాషా, ధనుంజయ, మానస, లోహిత్ ఈశ్వర్ రెడ్డి, కాంబ గిరి స్వామి, నాగజ్యోతి, సైనాథ్ రెడ్డి, ఇర్ఫాన్‌లు వివిధ అంశాలపై ప్రస్తావించారు. ఈ కార్యక్రమాల ద్వారా పాల్గొన్న విద్యార్థులకు నాయకత్వ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, దేశ నిర్మాణంలో యువత పాత్రపై స్పష్టమైన అవగాహన లభిస్తుందన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )